Pubilshed from Vijayawada
PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA
సంపుటి : 15 | సంచిక : 180 | శనివారం | అక్టోబర్ 24, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 15 | Issue No : 180 | Saturday | 24 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## నేడు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు

- ఒక్క రోజు ఢిల్లీ పర్యటనకు చంద్రబాబు
- రేపు అర్ధరాత్రికి మళ్లీ అమరావతికి చేరుకోనున్న సీఎం
- కేంద్ర పెద్దలను కలిసే అవకాశం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం. రేపు మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. - మిగతా 2లో..

# ఎవ్వరినీ వదలా..!

## తిరగ బడండి... ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొండి

- ఇలాంటి క్రిమినల్స్ చేతిలో అధికారం శ్రేయస్కరం కాదు
- పోరాడుతున్న నా అక్కచెల్లెమ్మలకు నా హ్యాట్సాఫ్. - రేపు వారు అన్నీ ఎదుర్కోవాల్సి ఉంటుంది
- వారందరికీ తగిన శిక్ష తప్పదు
- ఈ విషయం గుర్తుంచుకొండి
- వైసిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్




ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి :

"రాష్ట్రంలో అన్నింటా విఫలమైన వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వంపై ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని, అందుకే స్థానిక ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి, ఎలాగైనా గెలిచేందుకు అంతులేని అక్రమాలు చేస్తోందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్న చంద్రబాబు, ఆ దిశలో స్థానిక ఎన్నికల్లో అష్ట కుట్రలు చేస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం యథేచ్ఛగా బేఖాతర్ చేస్తున్నారని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) కానీ, ప్రభుత్వం కానీ వాటిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన్వెల్లడించారు. అన్ని కుట్రలకు పితామహుడు చంద్రబాబు అని, ఆయన ఫోర్జరీ, మోసాలు, కుట్రలు తారాస్థాయికి చేరాయని తెలిపారు. తొండి, అన్యాయం. దౌర్జన్యంతో స్థానిక ఎన్నికలు గెలవాలని చూస్తున్నారని, అలా ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా పాతర వేస్తున్న చంద్రబాబు, నియంతృత్వ ధోరణితో ముందుకెళ్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ప్రజా హక్కులు ఉంటాయని, నియంతృత్వ వ్యవస్థలో హక్కులు, స్వేచ్ఛ ఉండవన్న ఆయన, కాబట్టి ఈ విషయంపై ప్రజలంతా ఆలోచించాలని కోరారు."

'ఈరోజు పోలీసులు, అధికారుల సమక్షంలోనే నామినేషన్ పత్రాలు లాక్కుంటున్న టీడీపీ గుండాలు, రేపు ప్రజల ఆస్తులను కూడా అలాగే లాక్కుంటారని వైయస్ జగన్ హెచ్చరించారు. అందుకే ప్రజలంతా తిరగ బడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, లేని పక్షంలో ఏ ఒక్కరి ఆస్తులు, స్వేచ్ఛ, హక్కులకు రాష్ట్రంలో గ్యారెంటీ లేదని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వైయస్ జగన్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీ వైయస్ జగన్ ఇంకా ఏమేం మాట్లాడారంటే" స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు చేస్తున్న అక్రమాలపై గత ఆదివారం ప్రెస్‌మీట్‌లో అన్ని ఆధారాలు చూపడంతో పాటు, ఇక్కడ ఎస్ఈసీని కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేశాం. ఆ తర్వాత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించి, అన్ని ఆధారాలు చూపడంతో, సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కి అక్షింతలు వేసింది. నామినేషన్ వేయలేకపోయిన వారికి అవకాశం ఇవ్వాలని ఆదేశించింది.ఇవి పార్టీ పరంగా జరుగుతున్న ఎన్నికలు. అలాంటప్పుడు మా పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేయించమని అడిగితే, ఎదుటి పక్షం మాకు ఆ అవకాశం ఇవ్వడం లేదు. మా పార్టీ అభ్యర్థుల నామినేషన్ వేయనివ్వడం లేదు. అంటే వ్యవస్థ దిగజారిపోయింది అనే కదా వాస్తవం. ఇవి పార్టీ పరంగా జరిగే ఎన్నికలు. అయినా మా అభ్యర్థులను ఎందుకు నామినేషన్ వేయనివ్వడం లేదు, సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. అక్టోబరు 25 వరకు తుది జాబితాలు ప్రకటించవద్దని, నామినేషన్లు వేయలేకపోయిన వారికి మళ్లీ అవకాశం ఇవ్వాలని, అవసరమైతే జిల్లా కలెక్టరేట్ల వద్ద అందుకు ఏర్పాటు చేయాలని నిర్దేశించింది.

మిగతా : 2

## ఇంద్రకీలాద్రిపై సాధారణ పరిస్థితులు

### పూర్తిస్థాయిలో అందుబాటులోకి సేవా కౌంటర్లు

- తగ్గిన భవానీల రద్దీ.. మధ్యాహ్నం నుండి యథావిధిగా ఆలయ కార్యకలాపాలు
- ప్రత్యేక విధులు ముగించుకుని సాధారణ విధులకు హాజరైన దేవస్థాన సిబ్బంది
- అన్ని కౌంటర్లు తెరిచి భక్తులకు నిరంతర సేవలు అందించాలి
- ఈవో వి.కె. శీనా నాయక్

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్స వాలు ముగిసిన మూడవ రోజైన శుక్రవారం మధ్యాహ్నానికి ఇంద్రకీలా ద్రిపై సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. విజయదశమి అనంతరం గత రెండు రోజులుగా పోటెత్తిన భవానీ దీక్షాధారుల రద్దీ ఈరోజు ఉదయం వరకు కొనసాగింది. వేలాదిగా విచ్చేసిన భవానీలు ఇరుముడులు సమర్పించి, అమ్మవారిని దర్శించుకుని తమ దీక్షలను శాస్త్రోక్తంగా విరమించారు.

2 లో





## సిఎం చంద్రబాబుతో మరోసారి డిప్యూటి సిఎం పవన్ భేటీ

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఎపి సిఎం చంద్రబాబుతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ శుక్రవారం మరోసారి భేటీ అయ్యారు. పలుచోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ముఖ్యమంత్రి ఇంటికి పవన్ చేరుకుని ప్రత్యేక సమావేశమయ్యారు. నామినేషన్ల గడువు నేటితో ముగుస్తున్న నేపథ్యంలో .... కూటమి సీట్ల సర్దుబాటుపై సుమారు అరగంటసేపు వీరిద్దరూ చర్చించారు. టిడిపి, జనసేన, బిజెపి లోని ఆశావహు లు తమకు అవకాశం ఉన్న చోట్ల పో టాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో ఆయా చోట్ల ఏకా భిప్రాయం సాధించే అంశంపై చంద్ర బాబు, పవన్ చర్చించారు. నిన్న కూడా సిఎం తో పవన్ సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించిన సంగతి విదితమే.

## తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై త్వరలోనే మహారాష్ట్రతో చర్చలు



### 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పించేలా వాదనలు

- ఈనెల 23 తర్వాత చర్చలకు సానుకూలత తెలిపిన మహారాష్ట్ర సీఎం
- ఏదుల నుంచే డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీళ్లు
- పాలమూరు నీటికి గండి పడకుండా అదనపు నీటి తరలింపు
- శ్రీశైలం నుంచి ఏదుల వరకు అదనంగా 0.6 టీఎంసీల లిఫ్టింగ్
- నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, హైద్రాబాద్ :

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని సీఎం వెల్లడించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటినీ ఈ సమావేశంలో చర్చించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే వీలుంది.. 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సీఎంకు వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని వివరించారు.

మిగతా : 2



## వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్లు..

- సెన్సెక్స్ 126 పాయింట్లు డౌన్
- భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో దెబ్బతిన్న మదుపర్ల సెంటిమెంట్
- 87.65 పాయింట్లు క్షీణించి 22,600 వద్ద స్థిరపడ్డ నిఫ్టీ
- మెటల్, రియల్టీ, ప్రభుత్వ బ్యాంకుల షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- ఐటీ రంగంలో తక్కువ నష్టాలతో కొంత స్థిరత్వం
- నిఫ్టీ షేర్లలో శ్రీరామ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లకు నష్టాలు

ముంబయి : భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 125.56 పాయింట్లు నష్టపోయి 73,123.83 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 87.65 పాయింట్లు క్షీణించి 22,600 వద్ద ముగిసింది. అంతర్జాతీయ పరిణామాలపై ఆందోళనలతో మదుపర్లు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడారు.మార్కెట్‌లో ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది.

మిగతా : 2

## బంగాళాఖాతంలో అల్పపీడనం..

### తుఫానుగా మారే అవకాశం



న్యూఢిల్లీ : బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో రానున్న రెండు రోజులు మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు శుక్రవారం తెలిపారు. తూర్పు- మధ్య దానిని అనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, శనివారం వాయుగుండంగా మారనుందని భారతవాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడి.. ఈ నెల 26 ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది.

ప్రజాభూమి





# ఇంద్రకీలాద్రిపై సాధారణ పరిస్థితులు

మధ్యాహ్నా సమయానికి భవానీల రద్దీ క్రమంగా తగ్గడంతో ఆలయ ప్రాంగణమంతా ప్రశాంత వాతావరణం ఏర్పడింది. రద్దీ సాధారణ స్థితికి చేరుకోవడంతో, దసరా ఉత్సవాల నిమిత్తం ఘాట్ రోడ్డు, క్యూలైన్లు, హోల్డింగ్ ఏరియాలు, ప్రసాద వితరణ తదితర ప్రాంతాలలో ప్రత్యేక విధుల్లో నియమితులైన దేవస్థాన అధికారులు, ఉద్యోగులు ఆ బాధ్యతలను ముగించుకుని తమ తమ సాధారణ విభాగాల విధులకు హాజరయ్యారు.
ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఆదేశాలు జారీ చేస్తూ.. క్షేత్రానికి విచ్చేసే సాధారణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం టికెట్లు, లడ్డూ ప్రసాదం, పూజా టికెట్లు, విరాళాల కౌంటర్లు తదితర అన్ని సేవా కౌంటర్లను మధ్యాహ్నాం నుండే పూర్తిస్థాయిలో తెరిచి భక్తులకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిత్య అన్నప్రసాద వితరణ, ఆర్జిత సేవలు, అంతరాలయ దర్శనాలు నిబంధనల ప్రకారం సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

# నేడు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు

రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం..

తుపాను ఆ తర్వాత రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే సూచనలు ఉన్నాయని ఐఎండి పేర్కొంది. తుఫాను ప్రభావంతో, ఈ నెల 23 నుండి 25 వరకు అండమాన్ దీవులు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు, అలాగే పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. గంటకు 60 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, క్రమంగా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని ఆదేశించింది. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు శనివారం నాటికి తీరానికి చేరుకోవాలని సూచించింది. ఐఎండి సూచనల మేరకు ఒడిశా-ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు దూసుకు రానున్న తుఫానును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఒడిశా రెవిన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ పూజారి తె లిపారు. ఏపిలోనూ విస్తారంగా వర్షాలు అల్పపీడనం ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు తీరానికి తిరిగి రావాలని కోరింది.

# వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్లు..

నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 2.21 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.94 శాతం పడిపోయాయి. నిఫ్టీ షేర్లలో శ్రీరామ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. మెటల్, ఆర్థిక రంగ షేర్ల బలహీనత కూడా సూచీలపై ప్రభావం చూపింది.
రంగాల వారీగా చూస్తే మెటల్, రియల్టీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు అధికంగా జరిగాయి. నిఫ్టీ మెటల్, నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు అత్యధిక నష్టాలు నమోదు చేసిన రంగాల జాబితాలో నిలిచాయి. మరోవైపు ఐటీ షేర్లు కొంత స్థిరత్వాన్ని ప్రదర్శించాయి. ఇతర రంగాల సూచీలతో పోలిస్తే నిఫ్టీ ఐటీ తక్కువ నష్టాలతో ముగిసింది. ఇంట్రాడే కనిష్ఠ స్థాయి నుంచి సూచీ కోలుకోవడం 22,400-22,500 స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు ఉన్నట్లు సూచిస్తోందని విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే 22,600 వద్ద ముగియడం ఇంకా బలహీన సంకేతమేనని అభిప్రాయపడ్డారు. నిఫ్టీ 22,500 స్థాయిని నిలబెట్టుకుంటే 22,800-22,900 వరకు కోలుకునే అవకాశం ఉందని, ఆ స్థాయిని కోల్పోతే 22,300, 22,200 వరకు పడిపోయే ప్రమాదం ఉందని అంచనా వేశారు. 22,900 పైన నిలకడగా ముగిసినప్పుడే ప్రస్తుత పతనం స్థిరపడుతోందనే సంకేతం లభిస్తుందని తెలిపారు. ముందు రోజుల్లో ద్రవ్యోల్బణ ధోరణులు, వృద్ధి-ధరల పెరుగుదల మధ్య సమతుల్యత సాధించేందుకు ప్రధాన కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయాలు మార్కెట్ల దిశను ప్రభావితం చేయనున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీల ఆదాయాలపై స్పష్టత, షేర్ల విలువలు ఆకర్షణీయంగా ఉండటం ఆధారంగా ఆయా షేర్లు, రంగాల్లో పెట్టుబడి అవకాశాలు కనిపించవచ్చని తెలిపారు.




# ఎవ్వరినీ వదలా...

అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని, ఆ దిశలో ఏం చర్యలు తీసుకున్నారో కూడా చెప్పాలని ఆదేశించింది. మొత్తం మీద ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని నిర్దేశించింది. మా పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయనిస్తే, అసలు గొడవే లేదు కదా? నిజంగా మీరు ప్రజలకు మంచి చేశామని అనుకుంటే, మాతో నామినేషన్లు వేయించే అవకాశం ఇచ్చి, ప్రజాతీర్పు కోరాలి. కానీ, ఆ పని చేయకుండా, మమ్మల్ని అడ్డుకోవడం అంటే, మీరు ఓడిపోతారన్న భయం ఉంది కదా? ఈ చర్యల ద్వారా ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఎన్నికలను బుల్డోజ్ చేయాలని చూస్తున్నారు కదా? అందుకే స్థానిక ఎన్నికల్లో జరుగుతున్న దారుణాలపై సుప్రీంకోర్టు చాలా లోతుగా కామెంట్స్ చేసింది. ప్రజాస్వామ్య విలువలు లేకుండా చేస్తే, జోక్యం చేసుకోక తప్ప దని కూడా సుప్రీంకోర్టు చెప్పింది.ఇంత స్పష్టంగా సుప్రీంకోర్టు ఆదేశించినా, చంద్రబాబునాయుడుగారిలో ఏ మాత్రమైనా మార్పు వచ్చిందా?ఎస్ఈసీలో ఏమైనా మార్పు వచ్చిందా? చంద్రబాబు చేతిలో తోలుబొమ్మ మాదిరిగా మారిన డీజీపీలో ఏమైనా మార్పు వచ్చిందా? డీఐజీలు, ఎస్పీలు, కలెక్టర్లలో ఏమైనా మార్పు వచ్చిందా? అంటే, ఏమీ రాలేదు. సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై గౌరవం లేదు. ప్రజాస్వామ్యం అంటే అంతకన్నా గౌరవం లేదు.

**19కి బదులు, 4 మున్సిపాలిటీల్లోనే..:** 19 మున్సిపాలిటీల్లో నామినేషన్లు వేయనివ్వలేదని మేము ఆధారాలతో సహా, ఫిర్యాదు చేస్తే.. కేవలం మైదుకూరులో మొత్తం వార్డులు, తిరుపతిలో 18 డివిజన్లు, కడపలో 11 డివిజన్లతో పాటు, రాజంపేటలో మరో 11 వార్డుల్లో మాత్రమే రీనామినేషన్లకు అవకాశం ఇస్తున్నారు. 19 మున్సిపాలిటీల్లో మమ్మల్ని నామినేషన్లు వేయనివ్వలేదని ఆధారాలతో సహా, మేము సుప్రీంకోర్టుకు వెళ్తే, కోర్టు మొట్టికాయలు వేసినా, వీరిలో మార్పు లేదు. కేవలం 4 మున్సిపాలిటీల్లో మాత్రమే రీనామినేషన్లకు అనుమతి ఇచ్చారు. అసలు వీరికి ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం ఉందా? నామినేషన్ విధానంలో ఎంపిక చేస్తే సరిపోతుంది కదా? ఎవరి కళ్లకు గంతలు కడుతున్నారు? ఇవి పార్టీపరమైన ఎన్నికలు. మా అభ్యర్థులను నామినేషన్ వేయించమని అడుగుతున్నాం. నామినేషన్లు వేయనివ్వకుండా, గెలుపు ఏకపక్షం చేసే పని చంద్రబాబు చేస్తున్నాడు. ఇది ధర్మమేనా?. కడపలో 66 వార్డులు ఉంటే, కేవలం 11 వార్డుల్లో మాత్రమే రీనామినేషన్ అంటున్నారు. వాటిలో కేవలం రెండే రెండు వార్డుల్లో పోటీ ఉండేలా చేసిన వీరు, మరో 11 చోట్ల ఇప్పుడు అనుమతి అంటే.. మొత్తం 13 వార్డుల్లో మాత్రమే పోటీకి అనుమతి ఇస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యమేనా?రాజంపేటలో 32 వార్డులుంటే, ఇంతకు ముందు కేవలం 3 వార్డుల్లో మాత్రమే పోటీ ఉండేలా చేశారు. కాగా, ఇప్పుడు మరో 11 వార్డుల్లో రీనామినేషన్‌కు అనుమతి ఇచ్చారు. అంటే 32 వార్డులకు గానూ, కేవలం 14 వార్డుల్లో మాత్రమే మా పోటీకి అనుమతి ఇస్తున్నారు.
అసలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తోందా? లేక చంద్రబాబు ఆదేశాలు పాటిస్తోందా?. టీడీపీ దాడులు, పోలీసులు అడ్డుకోవడం వల్ల 19 మున్సిపాలిటీల్లో మేము నామినేషన్లు వేయలేకపోయామని సుప్రీంకోర్టుకు వెళ్లాం. వాటితో పాటు, మరో 4 మున్సిపాలిటీల్లో స్క్రుటినీ పేరుతో మా అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. అంటే మొత్తం 23 అర్బన్ లోకల్‌బాడీస్‌లో పోటీ లేకుండా చేశారు.
పుంగనూరు, రాయచోటి, పిడుగురాళ్ల, ఎర్రగుంట్ల, కమలాపురం, గురజాల, దాచేపల్లి, దర్శి, గుత్తి, మైదుకూరు, రాజంపేట, జమ్మలమడుగు, తిరుపతి, పులివెందుల, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, తాడిపత్రి, కనిగిరి, చిత్తూరు, చిలకలూరిపేట, నెల్లూరు, కనిగిరి. మొత్తం 23 మున్సిపాలిటీలు. వీటిలో 15 చోట్ల ఏకంగా పోటీయే లేదు. మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులు కూడా లేరు. 8 చోట్ల నామినేషన్లు అస్సలు అనుమతించలేదు. గురుజాల, పిడుగురాళ్ల, దర్శి, రాయచోటి, కమలాపురం, ఎర్రగుంట్ల, మైదుకూరు, పుంగనూరులో నామినేషన్లు వేయనీయలేదు. 7 చోట్ల కొన్ని నామినేషన్లు పడ్డాయి. కానీ స్క్రుటినీ పేరుతో మళ్లీ అక్రమంగా ఛైర్మన్ అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించారు. దాచేపల్లి, కనిగిరి, బద్వేలు, రాజంపేట, పొద్దుటూరు, గుత్తి, నగిరి తదితర 15 చోట్ల ఛైర్మన్ అభ్యర్థి లేకుండా చేశారు. ఇంకా చిత్తూరు, నగరి, చిలకలూరిపేట, నెల్లూరులో స్క్రుటినీ పేరిట నామినేషన్లు తిరస్కరించారు. అసలు చంద్రబాబుగారు ఎందుకింత తొండి. దౌర్జన్యం. అన్యాయం చేస్తున్నారు. మీకు ధైర్యముంటే ఈ ఎన్నికలు ఎదుర్కోవచ్చు కదా? అసలు ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు వీటిని ఎన్నికలు అంటారా?
మహాభారతంలో శకునికి పాచికలు ఉండేవి. ఆయన కోరుకున్నట్లు నెంబర్లు వచ్చేవి. ఇక్కడ నీవు కూడా శకునిలా మారావు. నీ ఇష్టానుసారం ఎన్నికలను నిర్దేశిస్తున్నావు. ఎక్కడెక్కడ ఏం జరగాలో నీవే ఆదేశిస్తున్నావు.ఒక చోట తల (ఛైర్మన్) ఉండదు. కొన్ని చోట్ల కాళ్లు, చేతులు (వార్డు మెంబర్లు) ఉండవు. అంటే ఎక్కడా పూర్తి స్థాయిలో సక్రమంగా ఎన్నికలు జరగవు. మీరు ప్రజలకు నిజంగా మంచి చేసి ఉంటే, వాటిని చూపి, మీ పనితీరు చూపి ఎన్నికల్లో ఓట్లు అడగాలి. మీరు ఆ పని చేయడం లేదు. కానీ, ఆ పని మేము చేశాం. మా హయాంలో ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్. ఆయన చంద్రబాబు నియమించిన వ్యక్తి. నాడు ఎన్నికల షెడ్యూల్ రాగానే, ఆయన ఇష్టానుసారం ఆఫీసర్లను బదిలీ చేశారు. అయినా మేం ఏమీ అనలేదు. తీవ్ర కోవిడ్ ఉన్నా, ఎక్కడా ప్రజలకు మేలు చేయడంలో మేము వెనుకంజ వేయలేదు. వారికి ఎంతో మంచి చేశాం. అందుకే ఆ ఎన్నికల్లో విజయం సాధించాం. మ్యానిఫెస్టోలో చెప్పిన వాటిలో 95 శాతం అమలు చేసి చూపాం. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో పెనుమార్పులు తీసుకొచ్చాం. అందుకే ఆ ఎన్నికల్లో మేము 86 శాతం విజయం సాధించాం. అదే ఈరోజు అంతా మోసం. సూపర్‌సిక్స్ లేవు. ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు. నాడు సంతకాలు చేసి ఇంటింటికీ పంపించిన బాండ్లు ఒట్టివే అయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ ప్రజలు నిలదీసే పరిస్థితి. అందుకే ఈ స్థానిక ఎన్నికలు జరగనివ్వకుండా, అన్నీ ఏకగ్రీవం అయ్యేలా తొండి, దౌర్జన్యం. అన్యాయం చేస్తున్నారు.
అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా తగిన భద్రత కల్పించాలని, ఏర్పాట్లు చేయాలని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ఆదేశించినా, అది అమలు చేయకుండా బరితెగిస్తున్నారు. జంగిల్‌రాజ్ నడుపుతున్నారు. ఇక్కడ నారాసుర రక్త చరిత్ర కొనసాగుతోంది. రాష్ట్రంలోని 659 మండలాల్లో 101 మండలాల్లో జీరో నామినేషన్లు. అక్కడా అదే పద్ధతి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సమాయంలో ఏం చేశారో.. ఇప్పుడూ అదే చేస్తున్నారు. నామినేషన్ కేంద్రాల్లో టీడీపీ మనుషులు ఉంటారు. వారికి పోలీసులు అండగా ఉంటారు. అక్కడికి మా పార్టీ వారు పోగానే అడ్డుకుంటున్నారు. చేతిలో నుంచి నామినేషన్ పత్రాలు లాగేసుకుంటున్నారు. చింపేస్తున్నారు. ఎవరైనా నామినేషన్ వేస్తే, చివరకు ఆర్ఓ (రిటర్నింగ్ అధికారి) చేతిలో నుంచి కూడా నామినేషన్ పత్రాలు లాక్కుని చింపేస్తున్నారు. ఇంకా 70 మండలాల్లో 5 నామినేషన్ల కంటే తక్కువ పడ్డాయి.227 మండలాల్లో నామినేషన్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ఎన్నికల సందర్భంగా మా వారిపై జరుగుతున్న దాడులకు ప్రధాన కారణం.. సీఎం చంద్రబాబు. ఆయన చెప్పినట్లు ఆడుతున్న పోలీసులు. ఇతర అధికారులు. మరి వారిని బాధ్యతల నుంచి తప్పించకుండా, నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎలా జరుగుతాయి?. చంద్రబాబు ఒకప్పుడు పోలింగ్ కేంద్రాల రిగ్గింగ్ నుంచి, ఇప్పుడు ఏకంగా నామినేషన్ కేంద్రాల రిగ్గింగ్‌కు దిగజారాడు. మనం గతంలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రాల రిగ్గింగ్ చూశాం. తన రాజకీయ స్వార్థం కోసం చంద్రబాబుగారు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్నారు. ఆ దిశలో చంద్రబాబు, ఆయన గ్యాంగ్ కలిసి, ఈ స్థానిక ఎన్నికల్లో కుట్రలు చేస్తున్నారు. ఇలా కుట్రలతో చంద్రబాబు, ఆయన ఆధ్వర్యంలోని ఎస్ఈసీ దగ్గరుండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఇక్కడ దారుణ విషయం ఏమిటంటే.. దాడులకు ఎక్కువగా గురైంది మహిళలే. ఎందుకంటే వారికి 50 శాతం రిజర్వేషన్లు. దాన్ని తీసుకొచ్చింది మనమే. నాడు మన హయాంలో మహిళలు వర్ధిల్లారు.
అదే ఇప్పుడు చంద్రబాబు పుణ్యమా అని వారంతా దాడికి గురవుతున్నారు.ఈ ఎన్నికలు సజావుగా జరిగితే డివిజన్లలో కార్పొరేటర్లు మొదలు, గ్రామస్థాయిలో వార్డు సభ్యుల వరకు దాదాపు 80 వేల మంది మహిళలు ఎన్నికవుతారు. అందులో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ పదవుల్లో 7,216 మంది మహిళలు ఎన్నికవుతారు. మరి ఇన్ని వేల మంది మహిళలు నామినేషన్లు వేయడానికి వస్తే, వారి జుట్టు పట్టుకోవడం, చీరలు లాగేయడం, వారిని తిట్టి కొట్టి దాడులు చేస్తున్నారు. అందుకే నేను అడుగుతున్నాను. చంద్రబాబు అనేవాడు అసలు మనిషేనా? మహిళలపై దాడులు ప్రోత్సహిస్తున్న చంద్రబాబునాయుడుగారు, ఆ పని చేస్తున్న ఆయన పార్టీ గుండాలు, మరోవైపు ప్రత్యక్షంగా దీన్ని చూస్తూ ఊర్కుంటున్న పోలీసు అధికారులు, ఎస్ఈసీ.. చేస్తోంది ధర్మమేనా?. ఇవన్నీ చూశాక, ఆంధ్రప్రదేశ్‌ను అరాచక ప్రదేశ్ అని కాక ఏమంటారు? మా హయాంలో ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఒక్కటైనా ఇలా జరిగిందా? అంత సాఫీగా మేము ఎన్నికలు జరిపాము. అదే ఈరోజు అందుకు పూర్తి భిన్నంగా ఎన్నికలు. తొండి. అన్యాయం. దౌర్జన్యం. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లలో కూడా మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం మాదిరిగా జరుగుతోంది. ఆ అధికారులు. ఆ పోలీసులే ఉన్నారు. మరి ఏ విధంగా నామినేషన్లు వేస్తారు? చంద్రబాబు కుట్రల్లో పరాకాష్ట.. మా పార్టీ పేరుతో వారే నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. అలా సంఖ్యను పెంచి చూపి, రాష్ట్రంలో అంతా శాంతియుతంగానే జరుగుతోందని కోర్టులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.ఒక్కసారి ఈ వివరాలు చూడండి. నిజంగా ఆశ్చర్యపోతారు. ఎన్నికల కమిషన్ డేటా చూస్తే, అది మీకు అర్థమవుతుంది. 'ఒక్కసారిగా వైయస్సార్‌సీపీ నామినేషన్ల అసాధారణ పెరుగుదల' (ఎక్స్‌పొనెన్షియల్ సర్జ్ ఇన్ వైయస్సార్‌సీపీ నామినేషన్స్) కనిపిస్తుంది. రాష్ట్రంలో 9,829 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు జరుగుతుంటే, ఈనెల 21 నాటికి, అంటే మొన్న బుధవారం నాటికి వైయస్సార్‌సీపీ పక్షాన దాఖలైన నామినేషన్లు కేవలం 1,918 మాత్రమే. ఆ మర్నాడు, అంటే 22వ తేదీ గురువారం నాటికి వాటి సంఖ్య ఏకంగా 10,501 కి పెరిగింది. అంటే ఒక్కరోజులోనే వైయస్సార్‌సీపీ నామినేషన్ల దాఖలులో 547% పెరుగుదల. అలాగే 659 జడ్పీటీసీ పదవులకు ఎన్నికలు జరుగుతుంటే, ఈనెల 21 నాటికి వైయస్సార్‌సీపీ పక్షాన దాఖలైన నామినేషన్లు కేవలం 192 మాత్రమే. ఆ మర్నాడు, అంటే 22వ తేదీ నాటికి వాటి సంఖ్య ఏకంగా 900 కి పెరిగింది. అంటే ఒక్కరోజులోనే వైయస్సార్‌సీపీ నామినేషన్ల దాఖలులో 468% పెరుగుదల. ఒకవైపు ఎక్కడికక్కడ నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. మండల కేంద్రాల్లోనూ, జిల్లా కేంద్రాల్లోనూ అదే మాదిరిగా ఉంది. కానీ ఇక్కడ ఎన్నికల కమిషన్ డేటా చూస్తే.. ఆ స్థాయిలో మా పార్టీ నామినేషన్లు పెరిగాయి!. అంటే వైయస్సార్‌సీపీ పేరుతో వెన్నుపోటు పార్టీ వారే ఫేక్ నామినేషన్లు దాఖలు చేస్తున్నారు.

**(ఇవీ కొన్ని వివరాలు అంటూ ఆధారాలతో సహా పీపీటీలో చూపారు)** : ఇది కొండాపురం మండలం కొండాపురంలో14, 15, 16, 17, 18 వార్డులు. అన్నీ ఫేక్ నామినేషన్లు. వైయస్సార్‌సీపీ పేరుతో వెన్నుపోటు పార్టీ వారే వేశారు. మైలవరం మండలం దొమ్మల నంద్యాల. అక్కడ సిలివేరు లక్ష్మీదేవి వైఫ్ ఆఫ్ సిలివేరు గోపాలకృష్ణ పేరుతో వైయస్సార్‌సీపీ అభ్యర్థి అంటూ నామినేషన్. ఆమె మా పార్టీ అభ్యర్థిని కాదు. పులివెందుల నియోజకవర్గం, వేముల మండలంలో లోకేపల్లి మల్లికార్జునరెడ్డి, ఎస్.లక్ష్మీదేవి పేరుతో, వారు వైయస్సార్‌సీపీ పక్షాన వేశారంటూ, ఫేక్ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కుట్రలకు నిజంగా పితామహుడు చంద్రబాబే. ఆయన ఇంత దారుణమైన ఎత్తుగడ ఎందుకు వేశాడంటే, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ సజావుగా సాగుతున్నాయని సుప్రీంకోర్టుకు ఒక భ్రమ కల్పించే కుట్ర. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లలో వెన్నుపోటు పార్టీ వారే, మా వైయస్సార్‌సీపీ తరపున ఫేక్ నామినేషన్లు వేస్తున్నారు. అందుకే ఒక్క రోజే ఎంపీటీసీ నామినేషన్లలో 547%, జడ్పీటీసీ నామినేషన్లలో ఒకేసారి 468 శాతం పెరుగుదల చూపించారు. ఇటు చూస్తే, మండల కేంద్రాల్లోనూ, జిల్లా కేంద్రాల్లోనూ మా వాళ్ళని అడ్డుకుంటూ నామినేషన్లను వేయనీయకుండా కుట్ర చేస్తున్నారు. అటు మా పార్టీ పేరుతో వాళ్లే ఫేక్ నామినేషన్లు వేస్తున్నారు. ఆ నామినేషన్లలో ఎక్కడా ఏ ఫామ్స్, బీ ఫామ్స్ ఉండవు. వారంతట వారే వైయస్సార్‌సీపీ అని చెప్పుకోవడం, నామినేషన్ వేయడం, అదే ఎన్నికల కమిషన్ డేటాలో చేర్చడం.. అంతా కుట్రలో భాగంగా జరుగుతోంది. ఈ స్థాయిలో అంతులేని అక్రమాలు జరుగుతుంటే, సీఎం చంద్రబాబు, ఎస్ఈసీ ఆధ్వర్యంలో ఇంత జరుగుతుంటే, అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అనేది ఉందా? అన్న సందేహం కలుగుతోంది.ఇవి పార్టీ పరంగా జరిగే ఎన్నికలు. అందుకే మేము మా పార్టీ అభ్యర్థులను ప్రకటించాం. వారికి ఏ ఫామ్స్, బీ ఫామ్స్ కూడా ఇచ్చాం. అందుకనే మా పార్టీకి సంబంధించిన మొత్తం అభ్యర్థుల జాబితాలను ఎస్ఈసీకి ఇస్తాం. హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా సమర్పిస్తాం. న్యాయం చేయమని అడుగుతాం.
ప్రజలకు ఏ మాత్రం మంచి చేయని వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు.. ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసు కాబట్టే, ఎన్నికలను బుల్డోజ్ చేస్తున్నారు. అందుకే, నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు పెట్టాలని, కేంద్ర బలగాలు మోహరించాలని కోరుతున్నాం. (పశ్చిమ బెంగాల్‌లో అలాగే చేశారు).ఇంకా మా పార్టీ అభ్యర్థులకు భద్రత కల్పిం చాలని కోరుతున్నాం. దాని కోసం హైకోర్టుకు కూడా వెళ్లాం. హైకోర్టు అందుకు అనుగుణంగా ఆదేశాలు కూడా జారీ చేసింది. అయినా ఎస్ఈసీ పట్టించుకోలేదు. అసలు ఎన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు పెట్టారని ఎస్ఈసీని మేము అడిగితే, సమాధానం లేదు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏం చర్యలు తీసుకున్నారని అడిగాం. దానికీ సమాధానం లేదు. ఇంకా ఏ ఒక్కరిపై చర్యలు లేవు. ఆర్ఓల చేతిలో నుంచి నామినేషన్లు లాక్కుని చింపేసినా, వారు కనీసం ఫిర్యాదు కూడా చేయడం లేదు. ఇంకా మా ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు లేవు. ప్రజాస్వామ్యం అంటే, నిర్భయంగా ఓటు వేయాలి. అన్ని ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలి. మరి ఇవన్నీ లేనప్పుడు రాష్ట్రంలో రాజ్యాంగం కుప్పకూలినట్లు కాదా? తక్షణం సుప్రీంకోర్టు పర్యవేక్షణలో, ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను తీసుకొచ్చి, అతడి ఆధ్వర్యంలో ఎన్నికలు జరపాలి. దాడులు జరిగిన జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లు, ఐజీలను బదిలీ చేయాలి. కక్షపూరితంగా విధులు నిర్వర్తిస్తున్న 59 మంది డీఎస్పీలపై మేము ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. తక్షణం వారిని ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించాలి. నామినేషన్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సుల స్టోర్స్, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వెంటనే కేంద్ర బలగాలు రప్పించాలి.

**ప్రజలకు ఒకటే విజ్ఞప్తి తిరగబడండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోండి** : ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ప్రజా హక్కులు కాపాడపడతాయి. అదే నియంతృత్వ వ్యవస్థలో ప్రజలకు ఎలాంటి హక్కులు, స్వేచ్ఛ ఉండదు. కాబట్టి ప్రజలంతా ఆలోచించాలి. ఈరోజు మీ ఓటు ఎంతో ముఖ్యం. దాన్ని సక్రమంగా వినియోగించుకోకపోతే, రేపు మీ ఆస్తులను ఇలాగే లాక్కుంటారు. ఎందుకంటే ఇప్పుడు ఈ ప్రజాస్వామ్యంలో అధికారుల సమక్షంలోనే పత్రాలు లాక్కుని చింపేస్తున్నారు. రేపు మీ ఆస్తి పత్రాలు కూడా ఇలాగే అధికారులు, పోలీసుల సమక్షంలోనే లాక్కుని చింపేస్తారు. కాబట్టి, తిరగ బడండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొండి. లేకపోతే ఏ ఒక్కరి ఆస్తులు, స్వేచ్ఛ, హక్కులకు గ్యారెంటీ లేదు. ఇంత క్రిమినల్స్ చేతిలో అధికారం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పుడు వీరి చేతిలో అధికారం వల్ల, ఏం అవుతుందనేది ఒకసారి ఆలోచించండి. చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు అనేవి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే కాదు. అది ఒక దారుణమైన నేరం. అందుకే ఈ ప్రజాస్వామాన్ని కాపాడుకోవాలి. ఎందుకంటే, చంద్రబాబుది క్రిమినల్ కుట్ర.ఈ దుర్మార్గులను ఎదుర్కొంటున్న, పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారికి తోడుగా నిలబడుతున్న నాయకులు, పార్టీ వివిధ విభాగాలు.. ముఖ్యంగా లీగల్‌సెల్ వారికి నా హ్యాట్సాఫ్. ఇంకా ముఖ్యంగా చాలా గట్టిగా నిలబడి ఈ ఎన్నికల్లో పోరాడుతున్న నా మహిళా అక్క చెల్లెమ్మలకు నా హ్యాట్సాఫ్. మీకు జరుగుతున్న అన్యాయంపై మన లీగల్‌సెల్‌కు వివరించండి. డిజిటల్ డెయిరీలోకి ఎక్కించండి. రేపు మన ప్రభుత్వం రాగానే, ప్రతి ఒక్కరిపై చర్య తీసుకుంటాం. ఈ తప్పులు, నేరాలు చేసిన ఎవ్వరినీ వదిలి పెట్టబోము. అందరికీ శిక్ష పడుతుందని వైయస్ జగన్ హెచ్చరించారు.

# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై త్వరలోనే మహారాష్ట్రతో చర్చలు

మొదటి పేజీ తరువాయి

152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని వివరించారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకొని, సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో జరిగిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అటవీ, గిరిజన ప్రాంతం, అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మిస్తున్నామని సీఎం వివరించారు. అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఏళ్లకేళ్లు పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలని అన్నారు. అందుకే తుమ్మడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత.. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను సీఎం ఆదేశించారు. గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునే వీల్లేదని సీఎం అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల వివరాలు, అక్కడ చర్చించిన అంశాలు, వాళ్ళు కోరిన నివేదికలన్నీ వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సీఎం సూచించారు.
డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌజ్లు అమర్చాలి.. ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా.. లేదా ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనేది ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి.. అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు. నార్లాపూర్ నుంచి డిండికి నీటిని తీసుకోవాలా... ఏదుల నుంచి డిండికి నీటిని తీసుకోవాలనే విషయంలో మహబూబ్నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది.. ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు.
సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్, సీఎంవో సెక్రెటరీ మాణిక్‌రాజ్ తో పాటు సెక్రెటరీ (టన్నెల్) కల్నల్ పరీక్షిత్ మెహ్రా తో పాటు ఇరిగేషన్ జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, అన్ని ప్రాజెక్టుల సీఈలు పాల్గొన్నారు.

# కోటి దాటిన కోకొల్లల రుచుల సంగమం



❖ సరికొత్త మైలురాయిని సరస్ శక్తి ఫుడ్ కోర్టు ప్రాంగణం ❖ ఎస్‌హెచ్‌జీ మహిళలను ప్రోత్సహించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వీఎంసీ ధ్యానచంద్ర

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: విజయవాడ, పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు, వారి నైపుణ్యాలకు, ఆర్థిక స్వావలంబనకు చక్కని వేదికగా నిలుస్తోందని.. అదే విధంగా ప్రాంగణంలోని లైవ్ ఫుడ్ కోర్టులో అమ్మకాలు కోటి రూపాయలు దాటడం విశేషమని, ఇది ఆహార ప్రియుల నుంచి లభిస్తున్న ఆదరణకు, మహిళల కృషికి నిదర్శనమని అన్నారు.సరస్ మేళాలోని ఫుడ్ కోర్టులో అమ్మకాలు రూ. కోటి దాటిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆహార ఉత్పత్తుల విజయాన్ని పురస్కరించుకొని వారిని అభినందించి ప్రోత్సహించారు.

కేక్ కట్ చేసి విజయానందపు రుచిని పంచిపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక వంటకాలు, సంప్ర దాయ ఆహార రుచులను ఒకే వేదికపై ఆస్వాదించే అవకాశం సరస్ మేళా ద్వారా కలుగుతోందన్నారు. 50 లైవ్ ఫుడ్ స్టాల్స్‌లో వివిధ ప్రాంతాల ప్రత్యేక వంటకాలను అక్కడికక్కడే తయారుచేసి అందించడం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందన్నారు. భిన్న సంస్కృ తులు, సంప్రదాయాలు, ఆహార వైవి ధ్యాలను పరిచయం చేస్తూ ఆహార ప్రియులకు సరికొత్త అనుభూతిని అందిస్తోందని పేర్కొ న్నారు. మహిళలు తమ నైపుణ్యాలను వ్యాపార అవకాశాలుగా మలుచుకొని, స్వయంగా ఆదాయం సంపాదిస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పడ టం అభినందనీయమన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించడం, వినియోగదారులతో నేరుగా అనుసంధానం చేయడం వంటి లక్ష్యాలకు సరస్ మేళా దోహదపడుతోందని వివరించారు.

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. మాట్లాడుతూ జాతీయ సరస్ మేళా నగరంతో పాటు వివిధ ప్రాంతాల ప్రజలకు వివిధ రాష్ట్రాల ప్రత్యేక ఆహార రుచులను ఒకే వేదికపై ఆస్వా దించే అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోందని పేర్కొన్నారు. లైవ్ ఫుడ్ కోర్టులో కోటి రూపాయల కు పైగా అమ్మకాలు నమో దవడం మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతిభకు, కృషికి, ఆహార ప్రియుల ఆదరణకు నిదర్శనమని అన్నారు. ఇలాగే మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ధ్యాన చంద్ర ఆకాంక్షించారు.

సరస్ మేళాలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకింగ్ సేవల ప్రాధాన్యత, రుణ సదుపా యాల వినియోగం, ఆర్థిక నిర్వహణతో పాటు డిజిటల్ మార్కెటింగ్ ద్వారా తమ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడం, ఆన్‌లైన్ విక్రయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకొని, ఆధునిక మార్కెటింగ్ పద్ధతు లను అనుసరిస్తూ ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి

## ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచన

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

ఎన్నికల విధుల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ) ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.మచిలీపట్నం నగరంలోని చిలకలపూడి పాండురంగ హైస్కూల్, రుస్తుంబాద మున్సిపల్ పార్క్, నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల నిర్వహణపై అధికారులకు అందిస్తున్న శిక్షణను పరిశీలించారు.ఎన్నికల విధులకు సంబంధించి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలని కలెక్టర్ సూచిం చారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని తెలిపారు.



# విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

## మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం నగరంలోని రుస్తుంబాద మున్సిపల్ పార్క్‌లో ఉన్న నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో కలిసి కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు.పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, రోజువారీ మెనూ అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం చేసేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

# గుడ్లవల్లేరులో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు

## సెగ్మెంట్–1 అభ్యర్థిగా చిన్న నాగలక్ష్మి, సెగ్మెంట్–2 అభ్యర్థిగా బూసి కిరణ్మయి నామినేషన్ల దాఖలు



గుడ్లవల్లేరు, ప్రజాభూమి ప్రతినిధి

గుడ్లవల్లేరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సెగ్మెంట్–1 ఎంపీటీసీ అభ్యర్థిగా చిన్న నాగలక్ష్మి, సెగ్మెంట్–2 ఎంపీటీసీ అభ్యర్థిగా బూసి కిరణ్మయి తమ నామినేషన్లను దాఖలు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వర రావు (నాని) స్ఫూర్తితో, దుక్కుపాటి శశిభూషణం ప్రోత్సాహంతో పార్టీ శ్రేణులు భారీ ఊరేగింపుగా తరలివచ్చి నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం, మేకల అనిల్, పెనుమాల రంగారావు, దోమతోటి గోపి, సాతునూరి కిషోర్, దుర్గాప్రసాద్, కొనాల లూథర్, కొనాల ప్రసాద్, ఎమ్మార్పీ, ఫణి, గుదే రవి, చాపరాల క్రాంతి, ధరావత్ బాబు, సాయి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కానూరు, గోకవరం పంచాయతీల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న గోపు సత్యనారాయణ

## అమ్మవారికి ప్రత్యేక పూజలు.. ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు



మచిలీపట్నం, ప్రజాభూమి రూరల్

కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ శుక్రవారం కానూరు, గోకవ రం పంచాయతీల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కానూరు పంచాయతీలో నిర్వహించిన భవానీ దీక్ష విరమణ కార్యక్రమంలో, గోకవరం పంచాయతీలో జరిగిన అమ్మవారి ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ప్రార్థించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేషన్, మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ విజయం సాధించాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమాల్లో గోపు ప్రతాప్ నరేష్, గోపు నాగ మహేష్ బాబు, బోలిశెట్టి నాని, చిటికినేటి అయ్యప్ప, ఇవన సత్యనారాయణ, ఇవన లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలి

## కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న జడ్పిటిసి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకస్మికంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఇక్కడే అడిగి తెలుసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ, హెల్ప్ డెస్కులు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రతి కేంద్రం వద్ద నిరంతర వీడియోగ్రఫీ పర్యవేక్షణను ఏర్పాటు చేశాం అన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే మార్గదర్శనం చేసేందుకు ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేకంగా 'హెల్ప్ డెస్క సదుపాయాన్ని అందుబాటులో ఉంచాం అన్నారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసుకునేందుకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం అన్నారు. ఎవరైనా నామినేషన్ల దాఖలుకు వెళ్లే అభ్యర్థులను అడ్డుకున్నా లేదా ఇబ్బందులకు గురిచేసినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9154970454, పోలీస్ కంట్రోల్ రూమ్ లేదా సంబంధిత రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావచ్చు అన్నారు.

అడ్డంకులు సృష్టించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును సౌకర్యవంతంగా వినియోగించుకునేలా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో 'నిర్దేశిత కనీస వసతులు' తాగునీరు, విద్యుత్, షామియానా, ర్యాంప్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. గత ఎన్నికల పరిస్థితులను పరిశీలించి సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం అన్నారు. అక్కడ అదనపు పోలీసు బలగాల మోహరింపు, సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, అలాగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత భద్రతా ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను సిద్ధం చేశాం అన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పక పాటించాలని, ఎన్నికలు విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఘనంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రూబీ జూబ్లీ వేడుకలు

❖ 40వ వార్షికోత్సవ వేడుకలను అక్టోబర్ 26 న నిర్వహణ ❖ ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్,గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు ❖ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

దేశంలోనే తొలి వైద్య విశ్వవిద్యాలయంగా ఏర్పాటైన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ వెల్లడించారు.నవంబర్ 1, 2026 కి యూనివర్సిటీ ఏర్పాటై 40 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా అక్టోబర్ 26 సోమవారం విజయవాడ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రిజిస్ట్రార్ సాయి సుధీర్‌తో కలిసి వైస్ ఛాన్సలర్ వేడుకల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ... దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు దూర దృష్టితో 1986లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం వైద్య విద్యారంగంలో దేశానికే ఆదర్శంగా నిలి చిం దన్నారు. ఎన్టీఆర్ ఆలోచనతో ప్రారంభమైన ఈ విద్యా సంస్థ నాలుగు దశాబ్దాలుగా వైద్య, ఆరో గ్య విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ, అంచెలంచెలుగా విస్తరించిందని పేర్కొన్నారు.

### ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరు

అక్టోబర్ 26 న ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే రూబీ జూబ్లీ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వైస్ ఛాన్సలర్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె. రమేశ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరవుతారని వెల్లడించారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తరఫున గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మం త్రి కొలుసు పార్థసారథి ఉపరాష్ట్రపతికి విమానాశ్రయంలో స్వాగతం పలికి వేడుకలకు తీసుకువస్తారని వివరించారు. ఈ కార్యక్రమం సుమారు గంటా పది నిమిషాల పాటు కొనసాగుతుందని తెలిపారు.

### 580 కి పైగా కళాశాలలకు అనుబంధ విశ్వ విద్యాలయం

ప్రారంభంలో కొద్ది కళాశాలలతో ప్రారంభమైన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నేడు 580 కి పైగా కళాశాలలకు అనుబంధంగా కొనసాగుతూ విశేష అభివృద్ధి సాధించిందని డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు.విశ్వవిద్యాలయం పరిధిలో 18 ప్రభుత్వ, 20 ప్రైవేట్ వైద్య కళాశాలలు కలిపి మొత్తం 38 మెడికల్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా రెండు ప్రభుత్వ, 15 ప్రైవేట్ డెంటల్ కళాశాలలు, 280 కి పైగా నర్సింగ్ కళాశాలలు, సుమారు 95 ఫిజియోథెరపీ కళాశాలలు అనుబంధంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆయుష్ విభాగంలో ఆయుర్వేద, యునానీ, హోమియోపతి, నేచురోపతి కళాశాలలు కూడా వైద్య విద్యను అందిస్తున్నాయని తెలిపారు.

### 40 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్

విశ్వ విద్యాలయం నాలుగు దశాబ్దాల ప్రస్థానం, సాధించిన విజయాలు, వైద్య విద్యారంగానికి అందించిన సేవలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించనున్నట్లు వైస్ ఛాన్సలర్ వెల్లడించారు. ఈ చారిత్రక వేడుకలకు అనుబంధ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా వైద్య విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రిసెప్షన్, సావనీర్, ప్రోటోకాల్ తదితర విభాగాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అతిథుల ఆహ్వానం నుంచి కార్యక్రమ నిర్వహణ వరకు అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేస్తున్నామని డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు.వైద్య విద్యారంగంలో విశేష ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 ఏళ్ల మైలురాయిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ రూబీ జూబ్లీ వేడుకలు విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పరిశోధన మరియు అభివృద్ధి విభాగం డైరెక్టర్ (R&D)డా. సూర్య ప్రభ,ప్రచురణల విభాగం డైరెక్టర్ డా. కె. సుధ లు పాల్గొన్నారు.

# నామినేషన్ల దాఖలుకు ఆటంకాలు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి



## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు

## కృష్ణ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లాలో జరుగుతున్న రెండో సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియలో అభ్యర్థులకు ఏవైనా ఇబ్బం దులు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా ఎవరైనా అడ్డుకున్నా, నామినేషన్ సమర్పణలో ఏదైనా ఆటంకం కలిగినా వెంటనే 9849903961 ఫోన్ నంబర్‌ను సంప్రదించి సమాచారం అందించాలని తెలిపారు. అందిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహాయం అందిస్తామని పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలుకు నిర్ణయించిన గడువు 2026 అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఈ ప్రక్రియను పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.నామినేషన్ దాఖలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అభ్యర్థులు ఆలస్యం చేయకుండా సంబంధిత ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# అవినీతి, లంచగొండితనాన్ని సమూలంగా నిర్మూలించాలి

## భారత్ ఎలక్ట్రానిక్స్ విజిలెన్స్ అధికారి కె. శ్రీధర్ బాబు



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

దేశ పవిత్రతను, సమగ్రతను కాపాడేందుకు అవినీ తి, లంచగొండితనానికి పాల్పడే వారిని ఉపేక్షించకుండా సమాజం నుంచి ఆ దురాచారాలను సమూ లంగా నిర్మూలించాలని భారత్ ఎలక్ట్రానిక్స్ విజిలెన్స్ అధికారి కె. శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే అవినీతి, లంచగొండితనానికి వ్యతిరేకంగా పోరాడే స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఎవరైనా లంచం అడిగితే సంబంధిత అధికారులకు, అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజాధనంతో జీతాలు పొందుతూ అవినీ తికి పాల్పడే ఉద్యోగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిజాయితీ, నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి మాట్లాడుతూ అవినీతిపరులు, లంచగొండుల కారణంగా సమాజం నష్టపోతుందని, ఇటువంటి అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. అవినీతి నిర్మూలన కోసం కేంద్ర స్థాయిలో విజిలెన్స్ అధికారులు, రాష్ట్ర స్థాయిలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిరం తరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

### విద్యార్థులతో ప్రతిజ్ఞ.. అవగాహన ర్యాలీ

సదస్సు అనంతరం విద్యార్థినులతో పౌర సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు, అధ్యాపకులు విజయశ్రీ, పార్వతి, మున్వర్, శ్రీనివాస్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ జనసందోహం నడుమ కామవరపుకోట జెడ్పీటీసీగా మాగంటి పద్మవల్లీ దేవి నామినేషన్

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్థానానికి ఎన్డీయే కూటమి (టీడీపీ – జనసేన – బీజపీ) బలపరిచిన కామవరపుకోట జెడ్పీటీసీ అభ్యర్థిని మాగంటి పద్మవల్లీ దేవి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఏలూరు వీధులు పచ్చ జెండాలు, కూటమి పతాకాలతో జనసంద్రంగా మారాయి. మాజీ మంత్రివర్యులు మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) నాయకత్వంలో మాగంటి నిలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు సాగిన



భారీ ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులతో ఏలూరు నగరం కిక్కిరిసిపోయింది. దారిపొడవునా ప్రజలు, శ్రేణులు పద్మవల్లీ దేవిపై పూలవర్షం కురిపిస్తూ శుభాకాంక్షల వెల్లువ కురిపించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మాగంటి పద్మవల్లీ దేవి లాంఛనంగా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ.. ప్రజల నుంచి వెల్లువెత్తిన అపూర్వ ఆదరణ, శుభాకాంక్షలు చూస్తుంటే ఎన్నికల ఫలితం ముందే ఖరారైనట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. మూడు తరాల ప్రజాసేవ వారసత్వంతో ప్రజల హృదయాల్లో నిలిచిన మాగంటి కుటుంబానికి కూటమి బలం తోడైందని, పద్మవల్లీ దేవి రికార్డు స్థాయి భారీ మెజారిటీతో విజయం సాధించి ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పీఠాన్ని అధిష్టించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు మాగంటి వెంకటేశ్వరరావు బాబు, కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



# ప్రజలకు సేవ చేసేందుకే ఎన్నికల్లో పోటీ

- జనసేన కార్యకర్త సాధనల ప్రసాద్

ప్రజాభూమి ఏలూరు

నిస్వార్థ హృదయంతో ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు జనసేన కార్యకర్త సాధనాల ప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఆయన,తన తల్లి సాధనాల సుబ్బలక్ష్మి చేత కామవరపుకోట జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయించారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం మీడియాతో సాధనాల ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. తన తల్లి సాధనాల సుబ్బలక్ష్మిని ఎన్నికల్లో గెలిపిస్తే కామవరపుకోట ప్రాంత అభివృద్ధికి బాటలు వేసినట్లవుతుందని అన్నారు. కామవరపుకోటలో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తాను భారత సైన్యంలో 20 సంవత్సరాల పాటు సేవలందించినట్లు వెల్లడించారు.

ప్రస్తుతం జనసేన పార్టీ తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తల్లి సాధనాల సుబ్బలక్ష్మిని ప్రజలు ఆదరించి గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఏలూరులో కూటమి అభ్యర్థుల
# ఎన్నికల ప్రచారం జోరు

- నగర అభివృద్ధే లక్ష్యమంటూ ప్రజలకు హామీ



ప్రజాభూమి ఏలూరు

నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బడేటి చంటి శుక్రవారం నగరంలోని పలు డివిజన్లలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 9,10,11, 13,17వ డివిజన్లలో కూటమి అభ్యర్థులతో కలిసి పర్యటించగా,పలుచోట్ల ప్రజలు పూలు చల్లి ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రధాన లక్ష్యమని తెలిపారు.తాగునీటి సరఫరా,పారిశుధ్యం, రహదారులు,డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు,వివిధ డివిజన్ల అభ్యర్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దెందులూరు, పెదవేగి ఎంపీటీసీ నామినేషన్లు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

దెందులూరు ,పెదవేగి మండలంలో ఎంపిటిసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుగుకున్నారు. నామినేషన్ల దాఖలులో ఏదైనా ఆటంకం గాని, బెదిరింపులు గాని ఎదురైతే వెంటనే దగ్గరలోని పోలీసు సిబ్బందికి తెలియజేయాలని, వారు వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థలకు పారదర్శకమైన, స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకున్నదన్నారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియలో ఎవరికైనా ఏదైనా ఆటంకం కలిగితే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం, బయట, లోపల సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ లక్ష్మిప్రసన్న, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ప్రభృతులు పాల్గొన్నారు.

## పాలకొల్లు మండలంలో
# 85 ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు మండలంలో శుక్రవారం చివరి రోజు టిడిపి నుండి 20 మంది సభ్యులు, వైసిపి నుండి 8 మంది సభ్యులు, జనసేన పార్టీ నుండి 6 మంది సభ్యులు, బిజెపి నుండి 1 సభ్యుడు, ఇండిపెండెంట్గా ఒక సభ్యుడు ఎంపీటీసీ కొరకు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో మొత్తం టిడిపి తరపున 45, వైఎస్ఆర్సిపి తరుపున 30, జనసేన పార్టీ తరపున 8, బిజెపి 1, స్వతంత్ర అభ్యర్థి 1 మొత్తం 85 సెట్లు నామినేషన్లు వచ్చినవని రిటర్నింగ్ అధికారి పి మురళీకృష్ణ తెలిపారు.

ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తాసిల్దార్ దుర్గా కిషోర్, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి బాబు ఈ మూడు రోజులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

# పెదవేగి జెడ్పీటీసీ అభ్యర్థిగా చింతమనేని సాయి నవ్యశ్రీ నామినేషన్

ప్రజాభూమి ఏలూరు

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని సాయి నవ్యశ్రీ పెదవేగి జెడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా దుగ్గిరాల క్యాంపు కార్యాలయం నుంచి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం వరకు భారీ పాదయాత్ర, వాహన ర్యాలీ నిర్వహించారు. దారిపొడవునా అభిమానులు,కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.నామినేషన్‌కు ముందు ఏలూరు తూర్పు వీధిలోని గంగానమ్మ అమ్మవారిని, పెదవేగి మండలంలోని రాట్నాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం తల్లిదండ్రులు చింతమనేని ప్రభాకర్, రాధారాణి ఆశీస్సులు తీసుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఢిల్లీ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో బీఏ ఆనర్స్,



సోషియాలజీలో ఎంఏ పూర్తి చేసిన నవ్యశ్రీ, చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.నామినేషన్ అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాసేవ,ప్రాంత సమగ్రాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.తనకు అవకాశం కల్పించిన కూటమి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

# 28వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థిగా తానంకి కొండలరావు (బాలు)

- కొబ్బరికాయ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి

ప్రజాభూమి ఏలూరు

నగరంలోని 28వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా తానంకి కొండలరావు (బాలు) స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు.రానున్న ఎన్నికల్లో కొబ్బరికాయ గుర్తుపై పోటీ చేస్తున్న ఆయన,డివిజన్ ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా తానంకి కొండలరావు (బాలు) మాట్లాడుతూ,28వ డివిజన్ ప్రజలు తనపై నమ్మకం ఉంచి,తమ అమూల్యమైన ఓటును కొబ్బరికాయ గుర్తుపై వేసి తనను ఆదరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆశీస్సులు,మద్దతుతో ఎన్నికల్లో అఖండ మెజారిటీ సాధించేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.డివిజన్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి



చేయాలనే ఉద్దేశంతో తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, డివిజన్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 28వ డివిజన్ ఓటర్లు తనకు మద్దతుగా నిలిచి, కొబ్బరికాయ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని తానంకి కొండలరావు (బాలు) మరోసారి డివిజన్ ప్రజలను అభ్యర్థించారు.

# తాళ్లపూడిలో నామినేషన్ల జోరు.. ప్రశాంతంగా ముగిసిన ప్రక్రియ

- 15 ఎంపీటీసీ స్థానాలకు మూడు రోజుల్లో 105 నామినేషన్లు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ మూడు రోజులపాటు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ పర్యవేక్షణలో ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించారు. తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ ఆధ్వర్యంలో నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా, పార్టీల మధ్య ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని 15 ఎంపీటీసీ



స్థానాలకు జనసేన, టీడీపీ, బీజేపీ, వైసీపీ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రెండు రోజుల్లో 64 నామినేషన్లు రాగా, చివరి రోజైన శుక్రవారం మరో 41 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మూడు రోజుల్లో మొత్తం 105 నామినేషన్లు వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి జయరామ లక్ష్మి వెల్లడించారు.




## ముగిసిన ఆలిండియా
# సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు

### బహుమతులు అంద జేసిన గాంధీ భగవాన్ రాజు

ప్రజాభూమి ప్రతి నిధి పాలకొల్లు

సిహెచ్ బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు గురువారంతో ముగిసాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టుముక్కల బున్ రాజు తెలిపారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవం లో ఈ టోర్నమెంట్లో పాల్గొన్న విజేతలకు టోర్నమెంట్ చైర్మన్ గొట్టముక్కల గాంధీ భగవాన్ రాజు, టోర్నమెంట్ డైరెక్టర్ వివి సోమరాజు, అయిష్ట సెక్రెటరీ అరిటాకుల రాంబాబు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అంపైర్లుగా వ్యవహరించిన వినుకొండ దినేష్, పి వరప్రసాద్ రాజు, రిఫరీ గా వ్యవహరించిన గజేంద్ర నాయుడు, సినీ హాస్య నటుడు సారిక రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# యలమంచిలి జడ్పీటీసీ కూటమి అభ్యర్థిని కొడవటి నాగలక్ష్మి వరబాబు నామినేషన్ దాఖలు

ప్రజాభూమి ప్రతి నిధి పాలకొల్లు



యలమంచిలి జడ్పీటీసీ కూటమి అభ్యర్థిని కొడవటి నాగలక్ష్మి వరబాబు భీమవరం జడ్పీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు వివరాలు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా కొడవటి నాగలక్ష్మి వరబాబు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి రామానా యుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు, నామినేషన్ల స్వీకరణలో అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతీ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటుచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఏలూరు ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియ, ఏలూరు జిల్లా పరిషత్ లో జెడ్పిటిసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన ప్రతీ ఒక్కరినీ కలిసి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల దాఖలులో ఏదైనా ఆటంకం గాని, బెదిరింపులు గాని ఎదురైతే వెంటనే హెల్ప్ లైన్ 18002331077, 018812-224519 లేదా దగ్గరలోని రిటర్నింగ్ అధికారి లేదా పోలీసు సిబ్బందికి తెలియజేయాలని, వారు వెంటనే చర్యలు తీసుకుంటారని వారికి తెలియజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 27 జెడ్పిటిసి, 454 ఎంపిటిసి స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం తో ముగుస్తుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా పరిషత్ సీఈవో ఎం కృష్ణ మోహన్, ఆర్డీఓ లక్ష్మిప్రసన్న, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ కె వెట్రీ సెల్వి.

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది వంటిదని, ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు వేయడం అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, అది ఒక బాధ్యత కూడా అని, ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మన గొంతుకను వినిపించడం చాలా ముఖ్యమని, ఓటు హక్కు వినియోగించుకో



వడమే ఏకైక మార్గమన్నారు. నీతివంతమైన, పారదర్శకమైన పరిపాలనకు, మన ప్రయోజనాలను, మన సమాజాలను అత్యుత్తమంగా సేవలందించగల ప్రతినిధులను ఎన్నుకోవడానికి కూడా ఓటు వేయడం మనకు అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు కీలకమైనదేనని, అది సమాజంలో మార్పును తీసుకురాగలదన్నారు. ఎన్నికల ఫలితాలను నిర్ణయించడంలో ప్రతి ఓటు లెక్కలోకి వస్తుందని, ఒక్కోసారి ఒక్క ఓటే ఫలితాలను నిర్ణయిస్తుందన్నారు. నిజమైన ప్రజాస్వామ్య పరిరక్షణకు నిర్ణయాత్మక ప్రక్రియలో భాగస్వాములు కావడం, మన అభిప్రాయాలను వినిపించడం, ప్రభుత్వం ఎలా పనిచేయాలో నిర్ణయించడంలో మన మాటను చెప్పగలగడం ఒక గొప్ప అవకాశమన్నారు. ఓటు ప్రజల చేతిలో ఒక వజ్రాయుధమని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు వేసే ఓటు నీతివంతమైన, పారదర్శకమైన పరిపాలనకు దోహదపడుతుందన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ప్రతీ ఒక్కరి ప్రాథమిక హక్కు అని, నా ఓటు నా హక్కు, కార్యక్రమం కింద ఓటుహక్కు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి, ప్రతీ ఒక్కరూ తమ ఓటుహక్కును బాధ్యతతో వినియోగించుకు నేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నదని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు.

# ఎన్నికల విధులపై పి ఓ, ఏపీఓలకు శిక్షణ

- ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి : విలియమ్స్

**ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి**

రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధులు నిర్వహించనున్న పోలింగ్ అధికారులు (పీఓ), సహాయ పోలింగ్ అధికారులు (ఏపీఓ)లకు శుక్రవారం ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి ఈబీ విలియమ్స్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విలియమ్స్ మాట్లాడుతూ ఎన్నికల విధులపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. తహసీల్దార్ పీఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయులు ఎన్నికల విధులను





సమర్థవంతంగా నిర్వహించారని, ఈసారి కూడా అదే నిబద్ధతతో విధులు నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. మండల ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ అబ్దుల్ సలాం మాట్లాడుతూ ఎన్నికల విధులపై శిక్షణలో వివరించిన అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 ఎం. సత్యనారాయణ, ఎంఈవో-2 కె. ఆనంద్ కుమార్ పాల్గొనగా, మాస్టర్ శిక్షకులుగా కె. హజరయ్య, ఆర్. సాంబశివరావు వ్యవహరించారు.



## స్థానిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేటే లక్ష్యం

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**ప్రజాభూమి ఏలూరు**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌తో పలువురు టీడీపీ,కూటమి నేతలు వరుసగా భేటీ అవుతున్నారు.జడ్పీ చైర్మన్ అభ్యర్థి ఎంపిక, టికెట్ల కేటాయింపు, ఎన్నికల సమన్వయంపై నేతలు చర్చలు జరుపుతున్నారు.శుక్రవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి,ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి తదితరులు ఎంపీని కలిశారు.జడ్పీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న పలువురు నేతలు కూడా తమ అభ్యర్థిత్వానికి మద్దతు కోరినట్లు సమాచారం.ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ,పార్టీ నిర్ణయాలకు కట్టుబడి, కూటమి నేతలతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. తిరుగుబాటు అభ్యర్థులతో చర్చించి నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒప్పించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించే దిశగా పనిచేయాలని నేతలకు పిలుపునిచ్చారు.



## స్థానిక ఎన్నికల్లో
# సత్తా చాటుతాం

- సార్వత్రిక ఎన్నికల నాటికి మరింత బలపడతాం
- వైయస్సార్సీపి ఎంపీపీ అభ్యర్థి మడకం జంపాలరావు

**ప్రజాభూమి, బుట్టాయగూడెం**

స్థానిక ఎన్నికలలో సత్తా చాటుతాం... సార్వత్రిక ఎన్నికల నాటికి మరింత బలపడతామని వైఎస్ఆర్సిపి ఎంపీపీ అభ్యర్థిగా సీతప్ప గూడెం ఎంపీటీసీ స్థానం నుండి పోటీ చేస్తున్న మడకం జంపాలరావు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జంపాలరావు తమ నామినేషన్ ను ఎన్నికల అధికారులకు అందించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక ఎన్నికలలో వైఎస్ఆర్సిపి సత్తా చాటుతుందని, రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి పార్టీ తిరుగు లేని శక్తిగా బలపడుతుందని అన్నారు. గిరిజన ప్రాంతంలో రవాణా సదుపాయాలు అధ్వానంగా ఉన్నాయని, రహదారుల అభివృద్ధికి ప్రథ మ ప్రాధాన్యతతో పనిచేస్తానన్నారు.

గిరిజనులకు నాణ్యమైన వైద్య సదుపాయాలు కరువయ్యాయని, ఆసుపత్రుల అభివృద్ధితో గిరిజన ప్రాంత వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంత గిరిజనా భివృద్ధికి కూటమి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలోనే కూటమి ప్రభుత్వ రాక్షస పాలన తీరు ప్రజలకు అర్థమైందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు సైతం తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేయడం గమనార్హం అన్నారు. ప్రభుత్వ తీరు మారకుంటే రానున్న రెండేళ్లలో రాష్ట్ర అభివృద్ధి మరింత దిగజారి పోతుందని విచారం వెలిబుచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికలలో వైఎస్ఆర్సిపి అభ్యర్థులు విజయ దుందుభి మోగించి, రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి వైఎస్ఆర్సిపి పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయడం తమ ధ్యేయమన్నారు. ఈయన వెంట వైయస్సార్సీపి సీనియర్ నేతలు బానోతు కృష్ణ నాయక్, కుమ్మర హరి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## భారీ ర్యాలీతో ఎంపీటీసీ నామినేషన్లు
# దాఖలు చేసిన కూటమి అభ్యర్థులు

- ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో జీలుగుమిల్లిలో నామినేషన్ల సమర్పణ

**ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి**

జీలుగుమిల్లి మండలంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో 9 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) అభ్యర్థులు శుక్రవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ముందుగా బర్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరారు. అనంతరం జీలుగుమిల్లి ప్రధాన కూడలికి చేరుకుని జగదాంబ అమ్మవారిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అభ్యర్థులతో కలిసి దర్శించుకున్నారు. అక్కడి నుంచి తీన్మార్ డప్పుల నడుమ ఉత్సాహంగా ర్యాలీగా జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని సంబంధిత అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

**నామినేషన్లు దాఖలు చేసిన కూటమి అభ్యర్థులు**

జీలుగుమిల్లి: కారం సుజాత
కామయ్యపాలెం: సోదేం విజయకుమారి
వంకవారిగూడెం: కుంజా రాంబాబు
తాటియాకులగూడెం: జాస్తి హేమ
రాచాన్నగూడెం: వెన్నెం మాధవి
అంకన్నగూడెం: జమ్మి గోపి ములగలంపల్లి: వనమా శాంతి



దర్భగూడెం: పద్దం వెంకటకృష్ణ

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గడ్డమనగు రవికుమార్, పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, బండారు అనిల్ కుమార్, ఉండవల్లి సోమసుందరం, జాస్తి సత్యనారాయణ, సూరిశెట్టి మహేష్, గుడపాటి పుల్లయ్య, గుడపాటి అరుణ్ కుమార్, పానుగంటి శ్రీను, నాలి శ్రీను, సంకుల రామకృష్ణ, గూడెల్లి లక్ష్మీనారాయణ, కోర్స దుర్గారావు, తమ్మన సాంబ, చాపా రవి, మరీదు కొండయ్య, పండు, నారాయణ, కుంజా రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, కిరణ్, రాయి సుబ్బారావు, వనమా రాంబాబు, చప్పిడి హరికృష్ణ, చిర్రి శ్రీను, కోలా మధు, రూపా సత్యనారాయణ, కొప్పుల శ్రీకాంత్, సొంటి రామకృష్ణ, కక్కిరాల శ్రీను, సాదు చెన్నారావు, మందపాటి సూర్య, పేరుబోయిన దాము, భరగడ రాజు, మద్దాల రమేష్, దేవుడు శ్రీను తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్లకు
# పటిష్ట పోలీసు బందోబస్తు

- బెదిరింపులు, అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**ప్రజాభూమి ప్రతినిధి - అనకాపల్లి**



జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని అవసరమైన చర్యలు చేపట్టిందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేయాలి జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని సూచించారు.

**బెదిరింపులు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

నామినేషన్లు దాఖలు చేయకుండా ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, అడ్డంకులు సృష్టించినా వెంటనే సంబంధిత స్థానిక పోలీసు అధికారులను లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. బాధిత అభ్యర్థులకు అవసరమైన భద్రత కల్పించి, నామినేషన్ కేంద్రానికి చేరుకుని నిర్ణీత గడువులోగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

నామినేషన్ల ప్రక్రియకు ఆటంకాలు కలిగించినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేసినా బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు, అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

# యలమంచిలి కూటమి ఎంపీపీ అభ్యర్థి పీతల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు

**ప్రజాభూమి ప్రతినిధి ,పాలకొల్లు**

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి ఎంపీపీ అభ్యర్థి పీతల శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్ వేశారు. పెనుమర్రు ఎంపీ టీసీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు.ఈ సందర్భంగా పీతల శ్రీనివాస్ మాట్లాడు తూఎంపీపీ అభ్యర్థిగా తన పేరు ప్రకటించి నందుకు మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నిమ్మలతో కలసి ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవలాందిస్తానని, ఎంపీటీసీగా, ఎంపీపీగా గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమం లో మండల్ టీడీపీ అధ్యక్షులు మామిడి శెట్టి పెద్దిరాజు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## నామినేషన్ల ప్రక్రియపై
# ఎన్నికల పరిశీలనాధికారి పరిశీలన



**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట రావులపాలెం**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల పరిశీలనాధికారి పి. ప్రశాంతి (కమిషనర్, ఆర్ అండ్ ఆర్) శుక్రవారం పరిశీలించారు. రావులపాలెం మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన ఆమె, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎన్నికల పరంగా క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించిన ఉబలంక గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన భద్రతా, మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాలలో కొత్తపేట డివిజన్‌కు సంబంధించిన స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రపరిచే గదుల భద్రత, ఇతర సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ, డీఎల్‌డీఓ, డీఎస్పీ, తహసీల్దార్, ఎంపీడీఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో కూటమి అగ్ర నేతల ఎన్నికల ప్రచార హోరు

**ప్రజాభూమి ప్రతినిధి రామచంద్రపురం**

రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది. కూటమి చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావు విజయమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి శుక్రవారం పట్టణంలోని 28, 31 తదితర వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లిన మంత్రులు, ఎంపీలు ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు 28వ వార్డు కూటమి అభ్యర్థి దంగేటి పద్మావతి, 31వ వార్డు కూటమి అభ్యర్థి గుబ్బల వెంకటరమణలతో పాటు కూటమి బలపరిచిన అభ్యర్థులందరినీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**గత మెజార్టీని మించి మేడిశెట్టి శేషారావును గెలిపించండి - రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు**

రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ప్రజలు 8,500కు పైగా మెజార్టీ అందించి తమ మద్దతు చాటారని గుర్తుచేశారు. అదే ప్రజాదరణను మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తూ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుకు అంతకంటే ఎక్కువ మెజార్టీ అందించాలని కోరారు.మంత్రి సుభాష్ చొరవతో రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.80 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొంటూ, పట్టణ రూపురేఖలను మార్చేందుకు ఆయన చేస్తున్న కృషిని ప్రజలు పరిశీలించాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి



చేశాం.. చేస్తున్నాం..అన్న నిబద్ధతతో కూటమి నాయకత్వం ముందుకు సాగుతోందని సానా సతీష్ పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి మరింత ఊతమివ్వాలంటే సమర్థవంతమైన స్థానిక నాయకత్వం అవసరమని, అందుకోసం మేడిశెట్టి శేషారావుతో పాటు కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

**30 ఏళ్ల రాజకీయ అనుభవం.. ప్రజా సమస్యలపై అవగాహన - ఎంపీ గంటి హరీష్ మాధుర్**

అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి మాట్లాడుతూ.. మేడిశెట్టి శేషారావుకు సుమారు 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, పట్టణ అభివృద్ధిపై చిత్తశుద్ధి, ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన నాయకుడని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని స్థానిక సంస్థల్లో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మేడిశెట్టి శేషారావును, ఆయా వార్డుల్లో కూటమి తరపున బరిలో ఉన్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల మద్దతు లభిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకుల సమష్టి ప్రచారం చేశారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు సానా సతీష్ బాబు, గంటి హరీష్ మాధుర్ బాలయోగి ఒకే వేదికపైకి వచ్చి ప్రచారం నిర్వహించడం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు, పట్టణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

**చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయండి - మంత్రి సుభాష్**

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. రామచంద్రపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు.రామచంద్రపురం పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, పట్టణాభివృద్ధికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని మంత్రి సుభాష్ విజ్ఞప్తి చేశారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి మేడిశెట్టి శేషారావు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకురాలు మజ్జి పద్మావతి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పప్పుల మసేను (రేవు శ్రీను) కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 24 అక్టోబరు 2026


## పుట్లూరు మండలం జడ్పిటిసి అభ్యర్థిగా సిపిఎం పార్టీ తరపున కే. భూషణం పోటీ

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండలం జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్ పి టి సి) అభ్యర్థిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) – సిపిఎం తరఫున కే. భూషణం (కే. నాగభూషణం) ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేదలు, మహిళలు, యువత సమస్యలపై పోరాటమే లక్ష్యంగా సిపిఎం పార్టీ ప్రజల్లోకి వెళ్తోంది.పుట్లూరు మండలంలోని గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగనుంది.ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే సిపిఎం పార్టీ అభ్యర్థి కే. భూషణం మండల కమిటీ సభ్యులుగా కెవిపిఎస్ జిల్లా నాయకుడుగా పనిచేస్తున్నారు.ప్రజలు తమ మద్దతు అందించాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.ఈ నామినేషన్ ప్రక్రియలో మండల కార్యదర్శి ఎస్.సూరి,రైతు సంఘం జిల్లా నాయకులు జి.వెంకట చౌదరి, మండల నాయకులు భాస్కర్ రెడ్డి, పెద్దయ్య, కుళ్లాయప్ప, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి... అభ్యర్థులకు భద్రత కల్పించాలి!

ప్రజా భూమి ప్రతినిధి అనంతపురం



అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు ఎదుర్కొంటున్న అడ్డంకులు, బెదిరింపులపై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించాం. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు, వారి ప్రతిపాదకులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని, నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరాం. ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలి. వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ గుంతకల్లు, తాడిపత్రి, సింగనమల వంటి చోట్ల వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకోవడం, పత్రాలను చించివేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అధికారంలోకి వచ్చినప్పటి నుండి కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలను అణచివేసే చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సింగనమల సమన్వయకర్త సాకే శైలజానాథ్, యువ నాయకులు డాక్టర్ సాకే రిత్విక్ ఉదయ్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పుట్లూరులో సజావుగా ఎంపీటీసీ నామినేషన్లు.. పటిష్ట బందోబస్తు చేపట్టిన పోలీసు అధికారులు. శుక్రవారంతో ముగిసిన నామినేషన్ల పర్వం.

ప్రజాభూమి, పుట్లూరు.



మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎంపీటీసీ నామినేషన్లు ఎట్టకేలకు అధికారుల నడుమ ప్రశాంతంగా సాగాయి .ముందస్తు చర్యలు భాగంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సిఐ వంశీకృష్ణ ఎస్ఐ సురేంద్రబాబు ఆధ్వర్యంలో నామినేషన్లు సజావుగా సాగేందుకు ప్రజలు శాంతి భద్రతలకు బంగం వాటిల్లకూడదని సాయ శక్తుల కృషిచేసి ప్రశాంతంగా నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు . పుట్లూరు మండలంలో మొత్తం 53 మంది నామినేషన్లు వేయగా వీటిలో వైఎస్ఆర్సిపి 27, తెలుగుదేశం 21, జనసేన మూడు స్థానాలలో, బిజెపి, స్వతంత్ర అభ్యర్థి చెరో స్థానంలో నామినేషన్లు దాఖలు చేశారు.

## నార్పల జడ్పీటీసీ అభ్యర్థిగా శివానందరెడ్డి నామినేషన్

ప్రజా భూమి నార్పల



నార్పల మండల జడ్పీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున శివానందరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్సీపీ నార్పల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బుసగాని నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గొల్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

## ఇస్రో పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా 28వ ర్యాంకు సాధించిన యాదవ్ బిడ్డ -సాయి సురేష్ యాదవ్

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం చిన్నమట్లగొంది గ్రామానికి చెందిన గొర్ల కాపరి గొల్ల ఆకుల సూర్యనారాయణ కుమారుడు గొల్ల సాయి సురేష్ యాదవ్ ఇస్రో నిర్వహించిన దేశవ్యాప్త పరీక్షల్లో ఆల్ ఇండియా 28వ ర్యాంకు సాధించారు. ఇస్రో సంస్థలో విధులు నిర్వహణకు గొల్ల ఆకుల సాయి సురేష్ యాదవ్ ఈ ఘనత సాధించడంతో ఆయన కుటుంబ సభ్యులు, యాదవ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు సాధారణ గొర్ల కాపరి కుటుంబం పుట్టి జాతీయ సంస్థ 28వ ర్యాంకు సాధించడం చాల సంతోషం అని కొనియాడారు యాదవ సంఘం తరుపున ప్రత్యేక శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.

## కల్లుమడి కూటమి ఎంపీటీసీ అభ్యర్థిగా ఎం కృష్ణ నామినేషన్

ప్రజా భూమి శింగనమల



శశీగనమల మండలం కల్లుమడి తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా యం. కృష్ణ నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. అభ్యర్థి తరపున శుక్రవారం తెలుగుదేశం నాయకులు అనంతపురం తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్ కార్యదర్శి దేగల కృష్ణమూర్తి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ పూర్తి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం జిల్లాలో జరిగే 2026 మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి హాలులో పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి స్మరణ్ రాజ్, ఐ.ఏ.ఎస్, జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు ఐఎఫ్ఎస్ ల సమక్షంలో పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడుతూ.... జిల్లాలోని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు గుత్తి, గుంతకల్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 689 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందుకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధిత హెచ్ఓడి లు ఎంట్రీ చేసిన డేటా ప్రకారం అధికారుల హోదా, ఆధారంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయక ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలు మొత్తం 4960 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. కేటాయించిన సిబ్బందికి 24 వ తేదీన నీలం రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్ నందు క్లాస్ రూమ్ తరహాలో శిక్షణ నిచ్చి పకడ్బందీ పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, డి ఐ ఓ భారతి, ఎన్ఐసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్, అనంతపురం రూరల్ నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం




అనంతపురం రూరల్ ఎంపీడీవో కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ పి. జగదీష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా కేంద్రాల వద్ద కల్పించిన పోలీసు బందోబస్తు మరియు డ్రోన్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. నామినేషన్లు దాఖలు ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అక్కడి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంత టివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నామినేషన్ల ప్రక్రియ అంతా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా పూర్తయ్యేలా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, బెదిరించడం లేదా ఇతర రూపాల్లో ఆటంకాలు కలిగించడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత ఎస్ హెచ్ ఓ, సి.ఐ లు లేదా డీఎస్పీల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అటువంటి ఫిర్యాదులపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని, నామినేషన్ల దాఖలుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో అభ్యర్థులకు తగిన పోలీసు రక్షణ కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికల ప్రక్రియ లో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## బెయిల్ నిబంధనలు తప్పకుండా పాటించాలి

### -అర్హత ఉంటే జామీయులదారులను ఏర్పాటు చేస్తాం -జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



న్యాయస్థానాలు బెయిల్ మంజూరు చేసిన తర్వాత విధించే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చట్టరీత్య చర్యలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో ఏ ఏ నేరాల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటి నుండి కారాగారంలో ఉంటున్నారు, న్యాయవాదులు ఉన్నారా, బెయిల్ మంజూరు అయిందా, జామీనుదారులను ఏర్పాటు చేసుకున్నారా, భోజన సౌకర్యం ఎలా ఉంది, వైద్య సేవలు అందుతున్నాయా, ఉపకారకార సిబ్బంది వివక్ష ప్రదర్శిస్తున్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, న్యాయస్థానాలు బెయిల్ మంజూరు చేసిన తర్వాత తప్పనిసరిగా నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. బెయిల్ మంజూరై కూడా జామీనుదారులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రూ.50 వేల వరకు జామీనుదారులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అర్హత ఉండి అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం కూడా అందిస్తామని తెలిపారు. క్షణికావేశంలో తప్పులు చేసి కారాగారాలకు రావడం వల్ల కుటుంబాల గౌరవ, మర్యాదలు దెబ్బతింటాయన్నారు. ఉపకారాగారంలో వివక్ష ప్రదర్శిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కారాగారంలో ఏమైనా సమస్యలు ఉంటే పారా లీగల్ వాలంటీర్ల ద్వారా ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సులో లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని డిఎల్ఎస్ఎ కార్యదర్శి సూచించారు. ఇందులో భాగంగా ఆయన ఆహార పదార్థాలు తయారు చేసేందుకు సరఫరా చేసిన బియ్యం, తదితర నిత్యావసరాల నాణ్యత ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంటగది, శుద్ధ నీటి ప్లాంట్ పరిశీలించారు. రికార్డులను పరిశీలించి వివరాలను ఉపకారాగార అధికారి హనుమన్నతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ, న్యాయవాదులు జగదీష్, ఆశ, యశస్విని, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్వైజర్ వాణిశ్రీ ఆకస్మిక తనిఖీలు

### 3 -6 ఏళ్ల పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడీకి పంపాలి

ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురం, శోధనపల్లిలో ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, పోతురాజు కాలువలోని అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్వైజర్ వాణిశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో రికార్డులు, పోషకాహారం, ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను తల్లిదండ్రులు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. పిల్లలకు మెనూ ప్రకారం తాజా వేడి భోజనం, గుడ్లు, పాలు అందించాలని సిబ్బందికి సూచించారు. పిల్లల ఎదుగుదలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, పరిశుభ్రత అలవాట్లు నేర్పించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో అంగన్వాడీ టీచర్లు బి. రత్నమ్మ, టి. నాగేశ్వరమ్మ, ప్రశాంతి, బి. సరస్వతి, హెల్పర్లు పాల్గొన్నారు.



## పోలీసుల బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ

ఎన్నికల అధికారి ప్రధాన గేటుకు తాళం వేపిస్తున్న దృశ్యం



ప్రజా భూమి నార్పల

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల స్వీకరణ సమయం ముగియడంతో ఎన్నికల అధికారి భారతి ఎంపీడీవో కార్యాలయం ప్రధాన గేటుకు తాళం వేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీవో మమతా దేవి, డిప్యూటీ ఎంపీడీవో శ్యామల, తహసీల్దార్ అరుణకుమారి, ఎన్నికల అధికారి భారతి, పోలీసు సిబ్బంది, ఇతర ఎన్నికల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో నామినేషన్ల ప్రక్రియ సజావుగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఎస్ఐ సాగర్, పోలీసు సిబ్బంది, ఎంపీడీవో మమతా దేవి, డిప్యూటీ ఎంపీడీవో శ్యామల, తహసీల్దార్ అరుణకుమారి, ఎన్నికల అధికారి భారతి, ఇతర సిబ్బందికి ప్రజలు అభినందనలు తెలిపారు.

## పతి విజయం కోసం సతి ప్రచారం

### -ముద్దిరెడ్డిపల్లిలో టిడిపి ఇంటింటా ప్రచారం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

తన భర్త, కూటమి పార్టీల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పురిడి మంజునాథ్ ను త్వరలో జరిగే ఎన్నికల్లో గెలిపించాలని ఆయన సతీమణి యుక్త శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాళ్లతో కలిసి ఆమె ముద్దిరెడ్డిపల్లి లోని పలు ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి పురిడి మంజునాథ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓటర్లు అభ్యర్థించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండడంతో స్థానికంగా కూటమి పార్టీలు బలపరిచిన పురిడి మంజునాథ్ ను గెలిపించడం వల్ల అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో హిందూపురం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మంజునాథ్ కృషి చేస్తారని, ఓటర్లు నవంబర్ 1వ తేదీన జరిగే ఎన్నికల్లో మంజునాథ్ ను గెలిపించాలని యుక్త కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే లక్ష్యం

### -అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా

### -మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వేణురెడ్డితో కలిసి షాజియా ప్రచారం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షాజియా హామీ ఇస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, అర్హులకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా పనిచేస్తానని ప్రజలకు వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని 36వ వార్డుతో పాటు పలు ఇతర వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వేణు రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జబివుల్లాతో కలిసి షాజియా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలను కలుస్తూ తమ పార్టీ లక్ష్యాలను వివరించారు. పట్టణంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ, వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని షాజియా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు మాజీ ముత్తవల్లి, వైఎస్సార్సీపీ నాయకులు కట్ల భాష, చాంద్ బాషాతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

శనివారం 24 అక్టోబరు 2026

# పట్టణ స్థానిక సంస్థల్లో నాలుగు చోట్ల నామినేషన్లకు మరో అవకాశం..!

- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కడప, రాజంపేట, మైదుకూరులో నామినేషన్ల స్వీకరణకు పొడిగింపు
- శుక్రవారం నుంచి నేడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్ ప్రాంగణంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాభూమి ప్రతినిధి,కడప: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కొన్ని పట్టణ స్థానిక సంస్థల్లో అభ్యర్థులు బెదిరింపులు, దాడులు, నామినేషన్ పత్రాల చింపివేత వంటి పరిస్థితుల కారణంగా నామినేషన్లు దాఖలు చేయలేకపోయినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించిందన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం 2026 అక్టోబరు 22న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎంపిక చేసిన నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్ల స్వీకరణ గడువును 48 గంటల పాటు పొడిగించినట్లు వివరించారు. వైఎస్సార్ కడప జిల్లాలోని కడప నగరపాలక సంస్థ, రాజంపేట పురపాలక సంఘం, మైదుకూరు పురపాలక సంఘం పరిధిలోని నిర్దేశిత వార్డులకు ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ,నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు నిర్దేశించిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలతో పాటు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిర్దేశించే కలెక్టరేట్ ప్రాంగణంలోనూ నామినేషన్ పత్రాలను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**వార్డుల వారీగా నామినేషన్ల స్వీకరణ**

కడప నగరపాలక సంస్థలో 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55వ వార్డులకు నామినేషన్ల గడువు పొడిగించారు. రాజంపేట పురపాలక సంఘంలో 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27వ వార్డులకు ఈ అవకాశం కల్పించారు. మైదుకూరు పురపాలక సంఘంలోని మొత్తం 32 వార్డులకూ నామినేషన్ల స్వీకరణ గడువును పొడిగించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం, పొడిగించిన గడువులో కొత్తగా స్వీకరించిన నామినేషన్ల పరిశీలన అక్టోబరు 25న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. కొత్తగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు మాత్రమే అదే రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

**అన్ని పట్టణ స్థానిక సంస్థలకు సవరించిన ఎన్నికల షెడ్యూల్**

రాష్ట్రంలోని మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలకు, పొడిగింపు వర్తించే నాలుగు సంస్థలతో పాటు విజయనగరం నగరపాలక సంస్థకు కూడా వర్తించేలా తుది పోటీదారుల జాబితా ప్రచురణ నుంచి ఎన్నికల షెడ్యూల్‌ను సవరించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 25న మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది పోటీదారుల జాబితాను ప్రకటిస్తారు. నవంబరు 1న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అవసరమైతే నవంబరు 2న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరిగి పోలింగ్ నిర్వహిస్తారు. నవంబరు 3న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలు చేయాలనుకునే అభ్యర్థులు నిర్దేశించిన తేదీలు, సమయాలను గమనించి సంబంధిత నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.

## చైర్మన్ అభ్యర్థి గీతా కుమారిని భారీ మెజార్టీతో గెలిపించండి

### భాకరాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించిన తూగుట్ల మధుసూదన్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల: పులివెందుల పట్టణంలో స్థానిక ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. శుక్రవారం పట్టణంలోని భాకరాపురంలో టీడీపీ చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతా కుమారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె భర్త, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు తూగుట్ల మధుసూదన్ రెడ్డి, తూగుట్ల సాయి సంధ్యారెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తన సతీమణి గీతా కుమారిని మున్సిపల్ చైర్మన్ గా, సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తూగుట్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, పులివెందులలో ఐదు సంవత్సరాల వైకాపా ప్రభుత్వంలో ఏం అభివృద్ధి చేశారో మీకే తెలుసునన్నారు. ఐదేళ్లలో జగనన్న కాలనీలో ఇళ్లను కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. పులివెందుల పట్టణంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని, మున్సిపాలిటీలో వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముందడుగు వేస్తామని హామీ ఇచ్చారు. మీ అమూల్యమైన ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి టీడీపీ చైర్మన్ అభ్యర్థి, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముల్లా, అజంతుల్లా, ఆంజనేయులు, గజ్జల సురేంద్రనాథ్ రెడ్డి, శివ, ఫయాజ్, అక్రమ్, శ్యామ్, చిన్న మల్లీ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చివరి రోజు భారీగా నామినేషన్లు.. మొత్తం 32 దాఖలు!

### మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ-ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్ఎన్ కృష్ణయ్య



ప్రజాభూమి,సిద్దవటం: సిద్దవటం మండలంలో ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మండలంలో మొత్తం 32 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్ఎన్ కృష్ణయ్య తెలిపారు. మొదటి రోజు నాలుగు, రెండో రోజు నాలుగు, చివరి రోజు అత్యధికంగా 24 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి సిద్దవటం జనరల్ మహిళ స్థానానికి రెండు, బొగ్గిడివారిపల్లి ఎస్సీ మహిళ స్థానానికి రెండు, జంగాలపల్లి ఎస్సీ జనరల్ స్థానానికి రెండు, మాచుపల్లి ఎస్సీ జనరల్ స్థానానికి నాలుగు, మాధవరం-1 జనరల్ మహిళ స్థానానికి రెండు, మాధవరం-2 బీసీ మహిళ స్థానానికి నాలుగు, పెద్దపల్లి బీసీ జనరల్ స్థానానికి నాలుగు, పొన్నవోలు ఓసీ జనరల్ స్థానానికి మూడు, టక్కోలు జనరల్ మహిళ స్థానానికి నాలుగు, ఉప్పరపల్లి ఓసీ జనరల్ స్థానానికి రెండు, వంతాటిపల్లి ఓసీ జనరల్ స్థానానికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, సిద్దవటం ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు ఫణి రాజకుమారి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేముల ఎంపీటీసీ అభ్యర్థిగా వెన్నపూస నీలకంఠారెడ్డి నామినేషన్ దాఖలు




ప్రజాభూమి, వేముల: వేముల మండల పరిషత్ ఎన్నికల్లో భాగంగా వేముల ఎంపీటీసీ అభ్యర్థిగా వెన్నపూస నీలకంఠారెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జి మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థిని అభినందించారు. అనంతరం నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి ధ్రువ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, వెన్నపూస నీలకంఠారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేముల మండల అధ్యక్షుడు చాగలేటి వెంకటేష్ బాబు, వేంపల్లి మండల అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కరీమీరెడ్డి అమర్నాథ్ రెడ్డి, తిరుమల శెట్టి వేమయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎర్రిపల్లె లో పశు వైద్య శిబిరం నిర్వహణ




ప్రజాభూమి, పులివెందుల: పులివెందుల వ్యవసాయ కళాశాల తుది సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో భాగంగా శుక్రవారం ఎర్రిపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అమర్నాథ్ రెడ్డి హాజరై పశువుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, సకాలంలో వైద్య సేవలు అందించడం, పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. తొండూరు పశు వైద్యాధికారి డాక్టర్ రఘు బాలకృష్ణ, పులివెందుల పశు వైద్యాధికారి డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక పశుపోషణ పద్ధతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రవి బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సి. ప్రత్యూష, డాక్టర్ నారాయణ స్వామి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఫ్యాన్ గుర్తుకే మీ రెండు ఓట్లు - వైఎస్ ప్రమీలమ్మను గెలిపించండి

### చౌడేశ్వరి దేవి వీధి, ఎస్బీఐ కాలనీలో వైకాపా ఇంటింటా ప్రచారం - మున్సిపల్ ఇన్చార్జ్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మను, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని చౌడేశ్వరి దేవి వీధి, ఎస్బీఐ కాలనీలో వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ కిరణ్ కుమార్ రెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పులివెందుల ఇంత అభివృద్ధి చెందిందంటే కారణం వైఎస్ కుటుంబమేనని అందరికీ తెలుసునన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటే మున్సిపల్ పీఠాన్ని వైకాపా దక్కించుకోవాలన్నారు. కూటమి నాయకులు ఎన్నో కుట్రలు పన్నుతున్నారని, వాటిని లెక్కచేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో వైఎస్ ప్రమీలమ్మ మున్సిపల్ చైర్మన్ గా పనిచేసిన అనుభవం ఉందని, ఆమెకు పులివెందులపై పూర్తి పట్టు ఉందని, మరోసారి ఆమెకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ కొంగనపల్లి విజయ్ కుమార్, ప్రదీప్ కుమార్ రెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మోల్ దినోత్సవం నిర్వహణ

### - అవగాడ్రో సంఖ్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన



ప్రజాభూమి, వేంపల్లె స్థానిక పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మోల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మోల్ భావన, అవగాడ్రో సంఖ్య ప్రాముఖ్యత, రసాయన శాస్త్రంలో దాని పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ మాట్లాడుతూ, రసాయన శాస్త్రంలో మోల్ భావన, అవగాడ్రో సంఖ్య ఎంతో కీలకమని వివరించారు. అలాగే రసాయన శాస్త్ర విభాగాధిపతి నాగేంద్ర మాట్లాడుతూ, విద్యార్థులు రసాయన శాస్త్రంపై అవగాహన పెంచుకొని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుంటూ జీవితంలో విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకుడు కుమార్ రాజా, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందుల ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ వైఎస్ కుటుంబం మీదే

### ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి
### 25, 26 వార్డుల్లో ఇంటింటి ప్రచారంలో వైయస్ ప్రమీలమ్మ



ప్రజాభూమి, పులివెందుల: పులివెందుల అంటేనే వైఎస్ కుటుంబమని, పులివెందుల ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ వైఎస్ కుటుంబం మీద ఉంటాయని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. శుక్రవారం పట్టణంలో ని 25, 26 వార్డులలో వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ శిల్పారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ ప్రమీలమ్మ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా పులివెందుల మున్సిపాలిటీకి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. పట్టణంలో ఎక్కడ చూసినా వీధి దీపాల కొరత ఉందని, అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని అన్నారు.

**వైఎస్ కుటుంబానికి పులివెందుల అంటే ప్రాణం**

వైఎస్ కుటుంబం పులివెందులకు ఎంత చేసిందో, ఏమి చేసిందో ప్రజలందరికీ తెలుసునని, వైఎస్ కుటుంబానికి పులివెందుల అంటే ఎనలేని ప్రాణమని అన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం ఎప్పటికీ వైఎస్ కుటుంబంపైనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ పులివెందుల అభివృద్ధి చెందాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని, టీడీపీ నాయకులు ఓట్లు వేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తారని, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వైకాపాకు మరోసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం - బీటెక్ రవి

### చైర్మన్ అభ్యర్థి గీతా కుమారితో కలిసి 26, 23 వార్డుల్లో విస్తృత పర్యటన



ప్రజాభూమి, పులివెందుల పులివెందుల మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామని పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతా కుమారితో పాటు కూటమి నాయకులు,



కార్యకర్తలతో కలిసి బీటెక్ రవి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 26వ వార్డు కూటమి అభ్యర్థి కదిరి లక్ష్మీదేవి, 23వ వార్డు కూటమి అభ్యర్థి బి. కమలమ్మ తరపున వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. పులివెందుల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాలే గంగమ్మ ఆలయంలో వెండి వస్తువుల చోరీ

### అమ్మవారి విగ్రహానికి ఉన్న 2.50 కిలోల వెండి వస్తువులు అపహరణ



ప్రజాభూమి,పులివెందుల పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని మాలే గంగమ్మ దేవాలయంలో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. ఆలయ తలుపులకు ఉన్న బిగాలను పగలకొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు, అమ్మవారి విగ్రహానికి ఉన్న సుమారు 2 కిలోల 50 గ్రాముల వెండి వస్తువులను అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామం నడిబొడ్డునున్న ఆలయంలో చోరీ జరగడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి, దొంగిలించిన వెండి వస్తువులను తిరిగి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మాధవరం-1 జనసేన ఎంపీటీసీ అభ్యర్థిగా సుభాషిణి



ప్రజాభూమి,సిద్దవటం: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సిద్దవటం మండలం మాధవరం-1 ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా అవ్వారు సుభాషిని శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. మాధవరం-1 ఎంపీటీసీ స్థానంలో జనసేన అభ్యర్థిగా ఆమె పోటీకి సిద్ధమయ్యారు. మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో రాజకీయ సందడి నెలకొంది.

## నామినేషన్లకు పటిష్ట బందోబస్తు - ఎస్పీ ఆదేశాలతో ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ

### ఏడు మండలాల కేంద్రాలను తనిఖీ చేసిన డీఎస్పీ మురళి నాయక్



ప్రజాభూమి, పులివెందుల ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నామినేషన్లు వేయిస్తున్నా మని, నియోజకవర్గంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటన లు జరగలేదని డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. శుక్రవారం పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును డీఎస్పీ మురళి నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరి చేత నామినేషన్లు వేయిస్తున్నామన్నారు. పులివెందుల, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట, సింహాద్రిపురం మండలాలలో అభ్యర్థులు స్వచ్ఛందంగా నామినేషన్లు వేశారని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున అభ్యర్థులను మాత్రమే లోపలికి అనుమతించి నామినేషన్లు వేయిస్తున్నామని, ఇతరులను దగ్గరికి రానివ్వడం లేదని స్పష్టం చేశారు.

## ఆర్ సి పురం లో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా మూడవ రోజు శుక్రవారం తిరుపతి జిల్లాలోని రామచంద్రపురం, మండల కార్యాలయాల్లో జరుగుతున్న ఎం పి టి సి, ఎమ్. పి పి



ల నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడుతో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, పరిశీలించారు. అనంతరం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. నామినేషన్ ప్రక్రియ జరిగుతున్న ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయంగా ఘటం జరగకుండా చూడాలని ఆదేశించారు.

## జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల దాఖలుకు అవకాశం

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,పూతలపట్టు: చిత్తూరు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం పూతలపట్టు ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. గత మూడు రోజులుగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని, ఇప్పటివరకు జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని తెలిపారు. మండల స్థాయిలో కూడా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగుతోందని పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలుకు ఇంకా సమయం ఉన్నందున అర్హులైన అభ్యర్థులు నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించి ఎవరికైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను లేదా జిల్లా ఎస్పీ తుషార్ డూడిని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు

## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన అగ్రికల్చర్ విద్యార్థులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్



తిరుపతిలోనీ శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు అయ్యప్ప నాయుడు క్షేత్రాన్ని ప్రాక్టికల్స్ లో భాగంగా శుక్రవారం అగ్రికల్చరల్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు సందర్శించడం జరిగింది . ఈ సందర్భంగా రైతు అయ్యప్ప నాయుడు మాట్లాడుతూ తన యొక్క ప్రకృతి వ్యవసాయ అనుభవాలను ప్రస్తుతం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు మరియు తన వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న వివిధ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విద్యార్థులకు క్షేత్రస్థాయిలో చూపించి వారికి అనుభవపూర్వకంగా అర్థమయ్యే విధంగా తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు రైతు వ్యవసాయ క్షేత్రంలో పాటిస్తున్నటువంటి పిఎండిఎస్ పద్ధతి విన్నుతున పద్ధతిలో నాటిన చెరుకు విధాన పద్ధతి ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్నటువంటి మామిడి తోట బీఆర్సీ సెంటర్ను సందర్శించివివిధ ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన విశేషాలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మార్గదర్శక వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి గణేష్ కుమార్ వారికి మార్గ నిర్దేశం చేయడం జరిగింది ఇందులో ద్వితీయ సంవత్సరం వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న 50 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## తిరుపతి రూరల్ జెడ్పీటీసీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున కె. జ్యోతీశ్వర్ నాయక్ నామినేషన్ దాఖలు!

**తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు!**



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగూరవం బాబు సూచనల మేరకు, తిరుపతి రూరల్ జెడ్పీటీసీ అభ్యర్థిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ చైర్మన్ కె. జ్యోతీశ్వర్ నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా సూళ్లూరుపేట, సత్యవేడు ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ పార్టీ తరఫున జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి, తిరుపతి డీసీసీ వైస్ ప్రెసిడెంట్ షేక్ కరీముల్లా, ఓబీసీ జిల్లా జనరల్ సెక్రటరీ డబ్బుగుంట సుధాకర్ యాదవ్, బి. ప్రదీప్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో జిల్లాలో రాజకీయ సందడి నెలకొంది.

## చివరి రోజు ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. రేణిగుంట మండలం లో మూడో రోజు జరిగిన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఎన్నికల భాగంగా శుక్రవారం చివరి రోజు కావడంతో అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్ లను దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియలను తిరుపతి జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీలత, జిల్లా సబ్ కలెక్టర్ గోవిందరావులతోపాటు ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట మండల రెవెన్యూ అధికారి శ్రావణ్ కుమార్ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యల నడుమ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల చివరి రోజు భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పరిశీలన

- నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు, సీసీ కెమెరాల నిఘాపై క్షేత్రస్థాయి పరిశీలన.
- ప్రత్యేక పోలీసు బలగాలతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు.
- ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రశాంతంగా, పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ.
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి జిల్లా పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల చివరి రోజు సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., పరిశీలించారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక పోలీసు బలగాల మోహరింపు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

**నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాలి:**

ఎన్నికల సంఘం నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా నామినేషన్ల ప్రక్రియ



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పూర్తయ్యేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట ప్రత్యేక బలగాలను సమర్థవంతంగా వినియోగిస్తూ శాంతిభద్రతలకు భంగం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని, సంబంధిత అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత వారిపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలి:**

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంత వాతావరణంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ

### జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడుతో కలిసి చంద్రగిరి, శ్రీకాళహస్తి, కోడూరు నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

### అభ్యర్థులు స్వేచ్ఛగా, నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాం

### -: జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు

ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,

తిరుపతి జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మూడో రోజు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడుతో కలిసి చంద్రగిరి, రామచంద్రాపురం, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కోడూరు, పుల్లంపేట, ఓబుళవారిపల్లి మండలాలో ఎం పి టిసి, జెడ్ పి టిసి ఎన్నికల నామినేషన్ కేంద్రాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు అన్ని మండలాల్లో అనుకూల వాతావరణం కల్పించామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నుంచి నామినేషన్లు దాఖలవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, అవాంఛనీయ సంఘటనలు చోటు





చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. గతంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌తో పాటు మూడు విడతల్లో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, అభ్యర్థులు స్వేచ్ఛగా, నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నామినేషన్ల దాఖలు సమయంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత సమాచారాన్ని సేకరించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనల్లో సంబంధిత ఆర్ డి ఓ లు, తహశీల్దార్లు, ఎం పి డి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## తొండవాడ శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల వైభవోత్సవాలు..!

### రుద్రోత్సవాల ముక్కోటి, అన్నాభిషేకం, కళ్యాణోత్సవం, పరమశివుని అద్భుత లేజర్ లైట్ షో ప్రధాన ఆకర్షణ..

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండలంలోని తొండవాడ గ్రామంలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో అక్టోబర్ 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు వైభవంగా ప్రత్యేక పూజలు, రుద్రోత్సవాల ముక్కోటి, అన్నాభిషేకం, కళ్యాణోత్సవం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు, అలాగే పరమశివుని దివ్యరూపాన్ని ఆవిష్కరించే అద్భుతమైన లేజర్ లైట్ షో 25వ తేదీ సాయంత్రం 7:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి తెలిపారు. ఈ మూడు రోజుల ఆధ్యాత్మిక మహోత్సవాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీ అగస్త్యేశ్వర స్వామివారి కృపా కటాక్షాలను పొందాలని ఆయన ఆహ్వానించారు.

అక్టోబర్ 24 -- శనివారం

ఉదయం 5:30 గంటలకు గణపతి పూజ, గణపతి పూర్ణాహుతి, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, గణపతి హోమం నిర్వహించనున్నారు.

ఉదయం7:30 గంటలకు సిద్ధిబుద్ధి సమేత వినాయక స్వామివారి ఉత్సవం జరగనుంది.

ఉదయం 11:00 గంటలకు అన్నాభిషేకం నిర్వహించగా, రాత్రి 7:00 గంటలకు వల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి వారి పల్లకీసేవ





వైభవంగా నిర్వహించనున్నారు.

అక్టోబర్ 25 -- ఆదివారం

ఈ రోజును రుద్రోత్సవాల ముక్కోటిగా ప్రత్యేకంగా నిర్వహించనున్నారు.

ఉదయం 12:30 గంటలకు అగస్త్య మహామునికి, లోపాముద్ర దేవికి అభిషేకం జరగనుంది.

ఉదయం 2:30 గంటలకు శ్రీ అగస్త్యేశ్వర స్వామివారికి, ఆనందవల్లి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు.

ఉదయం 4:00 గంటలకు స్వరదర్శనం నిర్వహించగా, రాత్రి 7:00 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరగనుంది.

రాత్రి 7:00 గంటలకు ప్రత్యేక ఆకర్షణ -- అద్భుత లేజర్ లైట్ షోభక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించే విధంగా కాంతుల సమ్మేళనంతో శ్రీ పరమశివుని దివ్యరూపాన్ని ఆవిష్కరించే అద్భుతమైన లేజర్ లైట్ షో నిర్వహించనున్నారు. భక్తి, ఆధ్యాత్మికత, ఆధునిక కాంతి సాంకేతికతల సమ్మేళనంగా రూపొందించిన ఈ కార్యక్రమం భక్తులకు చిరస్మరణీయమైన అనుభూతిని అందించనుంది. అక్టోబర్ 26 -- సోమవారంఉదయం 6:00 గంటలకు శ్రీ అగస్త్యేశ్వర స్వామివారికి, ఆనందవల్లి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు.

అనంతరం సాయంత్రం 6 గంటలకు వైభవంగా శ్రీ స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి మాట్లాడుతూ, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతో పాటు శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయ విశిష్టతను మరింతగా చాటిచెప్పేందుకు ఈ మూడు రోజుల మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఆదివారం రాత్రి జరిగే లేజర్ లైట్ షో ద్వారా పరమశివుని దివ్యరూపాన్ని కాంతుల ద్వారా ఆవిష్కరించడం ఈ ఉత్సవాల ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. భక్తులు, శివస్వామి భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బి.ఎన్. కండ్రిగలో ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వం

### చివరి రోజు 29 నామినేషన్లు.. టీడీపీ నుంచి 13, వైఎస్సార్‌సీపీ నుంచి 11 దాఖలు!

ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు కావడంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. మండలంలో మొత్తం 29 నామినేషన్ దరఖాస్తులు దాఖలైనట్లు అందిన వివరాలను బట్టి తెలుస్తోంది. దీంతో మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది.

పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు

మండలంలో తెలుగుదేశం పార్టీ తరఫున అత్యధికంగా 13 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 11 నామినేషన్లు





సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు, జనసేన పార్టీ తరఫున ఒకరు, భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు నామినేషన్ల దాఖలుతో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల ఉత్సాహం కనిపించింది. మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు ఆసక్తి చూపడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో తదుపరి ఎన్నికల ఘట్టాలపై అభ్యర్థులు, రాజకీయ నాయకులు దృష్టి సారించారు.

**ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల ప్రక్రియ**

నామినేషన్ల దాఖలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బి.ఎన్. కండ్రిగ స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా చివరి రోజు 29 నామినేషన్ దరఖాస్తులు దాఖలు కావడంతో బి.ఎన్. కండ్రిగ మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సందడి మొదలైంది. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది

# విధి నిర్వహణలో విషాద మరణం.. వీఆర్‌ఏ పరశురామయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

## మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి: వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు



వాకాడు గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్‌ఏ) చిట్టేటి పరశురామయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం రెవెన్యూ వ్యవస్థకు తీరని లోటని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం విచారం వ్యక్తం చేశారు.పరశురామయ్య మృతి పట్ల వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు.రాష్ట్ర నాయకుల బృందం మృతుని భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించింది.అనంతరం వాకాడు తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌ను కలిసి వీఆర్‌ఏల స్థితిగతులపై చర్చించింది. మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించడంతోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలను వెంటనే అందించాలని విజ్ఞప్తి చేసింది.కోట మండల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పోస్టుమార్టం ప్రక్రియను రాష్ట్ర నాయకుల బృందం పరిశీలించింది. అనంతరం స్థానిక పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ కె. పవన్ కుమార్‌ను కలిసి ప్రమాదానికి సంబంధించిన కేసు వివరాలను అడిగి తెలుసుకుంది. బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని, ప్రభుత్వం తగిన సహాయం అందించాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. శ్రీహరి, రాష్ట్ర కార్యదర్శి ఎం. అంకయ్య, సీనియర్ నాయకులు వి. లచ్చయ్య, బి. విజయ్, వీఆర్‌ఏలు కస్తూరయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# పోలింగ్ నిర్వహణలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

## బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి-జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,సామర్లకోట:
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ విధులను నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నియమ నిబం ధనలను ఖచ్చితంగా పాటిస్తూ,పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ సూచించారు. శు క్రవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయం లో ప్రిసైడింగ్ అధికారు లు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పోలింగ్ నిర్వహణ, ఎన్నికల సామగ్రి భద్రత, బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, పోలింగ్ అనంతరం పత్రాల అప్పగింత తదితర అంశాలపై అధికారులకు మార్గదర్శకాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల విధులకు సంబంధించిన హ్యాండ్‌బుక్ ను అధికారులు క్షుణ్ణంగా ఒకటికి రెండుసార్లు చదివి, అందు లో సూచించిన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందిం చుకోవాలని తెలిపారు. ఎన్నికల సామగ్రిని డిస్పాచ్ కేంద్రం నుంచి స్వీకరించినప్పటి నుంచి పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రంలో తిరిగి అప్పగించే వరకు బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సుల భద్రతకు సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత వహించా లన్నారు.

**డిస్పాచ్ కేంద్రంలో అప్రమత్తంగా వ్యవహరించాలి:**

డిస్పాచ్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని స్వీకరించే సమయంలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి సంబం ధించిన బ్యాలెట్ పేపర్లు, ఓటర్ల జాబితాలు,ఇతర ఎన్నికల సామగ్రి సక్ర మంగా ఉన్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించాల న్నారు. వార్డు సభ్యుల ఎన్నికకు, చైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, పత్రాలు సరైనవేనని నిర్ధారించు కోవాలని సూచించారు. ఓటర్ల జాబితా మార్క్డ్ కాపీతో పాటు ఇతర కాపీలను కూడా సరిచూ సుకోవాలని తెలిపారు.

**పోలింగ్ కేంద్రం ఏర్పాట్లు, ఓటింగ్ ప్రక్రియ:**

పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వెంటనే ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు, పోలింగ్ సిబ్బంది కూర్చునే ప్రదేశాలు, ఇతర అవసరమైన సదుపాయాలను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాల న్నారు. పోలింగ్ ఏజెంట్లు నిర్దేశిత సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, వారి సమక్షంలో నిబంధనల ప్రకారం అవసరమైన డిక్లరేషన్లు, బ్యాలెట్ బాక్సుల తనిఖీ, సీలింగ్ ప్రక్రియను పూర్తి చేసి నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభించాలని సూచించారు.

పోలింగ్ వివరాల నివేదికలు క్రమం తప్ప కుండా అందించాలి:
పోలింగ్ ప్రారంభమైన అనంతరం నిర్దేశించిన వ్యవధిలో పోలింగ్ శాతానికి సంబంధించిన వివరాలను ఉన్నతా ధికారులకు నివేదించా లన్నారు. పురుషులు, మహిళలు ఎంతమంది ఓటు హక్కు వినియోగిం చుకున్నారనే వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల సంఖ్యను సక్రమంగా లెక్కించేందుకు, ఓటర్ల జాబితాలో నిబంధనల ప్రకారం మార్కింగ్ విధా నాన్ని పాటించాలని తెలిపారు. పోలింగ్ విధులకు నియమితులైన సిబ్బంది ఎన్నికల మార్గ దర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రంలోనే బస చేయాల ని, అనుమతి లేకుండా విధుల ప్రదేశాన్ని విడిచి వెళ్లరాదని స్పష్టం చేశా రు.

**బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రి భద్రతకు ప్రాధాన్యత:**

పోలింగ్ ప్రక్రియలో ఉప యోగించే ప్రతి బ్యాలెట్ పేపర్, ఇతర ఎన్నికల పత్రాలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల ని కలెక్టర్ సూచించారు.




వార్డు సభ్యుల, చైర్‌పర్స న్ ఎన్నికలకు సంబం ధించిన బ్యాలెట్ పేపర్లు, పత్రాలను నిర్దేశిత విధానంలో వేర్వేరుగా క్రమబద్ధీకరించి, అవస రమైన సంతకాలు పూర్తిచేసి సంబంధిత కవర్లు, డబ్బాల్లో భద్రపరచాలన్నారు. వినియోగించిన బ్యాలెట్ పేపర్ల సంఖ్య, మిగిలిన బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల లెక్కలు పర స్పరం సరిపోలేలా అకౌంట్స్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు.

**రిసెప్షన్ కేంద్రంలో పత్రాల అప్పగింతపై ప్రత్యేక శిక్షణ**

పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, సంబంధిత పత్రాలను నిబంధనల ప్రకారం సక్రమంగా క్రమబద్ధీకరించి, తనిఖీ చేసిన తర్వాత రిసెప్షన్ కేంద్రంలో అప్పగించాల న్నారు. ఏయే పత్రాలు, సామగ్రిని సమర్పించాలి, ఏవి వేర్వేరుగా ప్యాక్ చేయాలి, వాటిని ఏ విధంగా వర్గీకరించి అప్పగించాలనే అంశాలపై పోలింగ్ సిబ్బందితో పాటు రిసెప్షన్ బృందానికి కూడా స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించా రు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ నిర్వహించడం ద్వారా ఎన్నికల సామగ్రి స్వీకరణ, అప్పగింత ప్రక్రియను వేగంగా, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పూర్తి చేయవచ్చన్నారు. ఎన్నికల విధుల్లో ప్రతి అధికారి అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఎన్నికల ప్రక్రి యను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ కుమారి ప్రియా, మున్సి పల్ కమిషనర్ కనకరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రగిరిలో ముగిసిన నామినేషన్ల పర్వం.. సర్వర్ల మొరాయింపుతో రాత్రివరకు సాగిన ఉత్కంఠ!

## గడువు ముగిసినా పూర్తికాని ఆన్‌లైన్ నమోదు..-కార్యాలయంలోనే పడిగాపులు కాసిన అధికారులు, పోలీసులు..

## మొత్తం 79 నామినేషన్లకు గాను రాత్రి వరకు అప్‌లోడ్ అయింది 23 మాత్రమే!

## సాంకేతిక లోపాలపై అభ్యర్థులు, నాయకుల అసహనం.. ముందస్తు కసరత్తు ఏదని ప్రశ్నలు..

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి మండల పరిషత్ కార్యాలయం (ఎంపీడీవో ఆఫీస్) వేదికగా సాగిన ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ తుది గడువు ముగిసింది. సాయంత్రం 5 గంటలతో భౌతిక నామినేషన్ల సమర్పణ ముగిసినప్పటికీ, సాంకేతిక సమస్యల కారణంగా ప్రక్రియ రాత్రి వరకు కొనసాగాల్సి వచ్చింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సర్వర్లు తీవ్రంగా మొరాయించడంతో నామినేషన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగింది. నామినేషన్ల చివరి రోజైన నేడు మండలంలోని వివిధ స్థానాలకు సంబంధించి మొత్తం 79 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే సర్వర్ పనిచేయకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి సమయానికి కేవలం 23 నామినేషన్లను మాత్రమే సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగలిగారు. మిగిలిన 56 నామినేషన్ల వివరాల నమోదు పెండింగ్‌లోనే ఉండిపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.నామినేషన్ల అప్‌లోడ్ పూర్తయితే తప్ప ప్రక్రియ అధికారికంగా ముగియని పరిస్థితి నెలకొనడంతో ఎన్నికల అధికారులు, సిబ్బందితో పాటు బందోబస్తులో ఉన్న పోలీసు అధికారులు కార్యాలయంలోనే పడిగాపులు కాశారు. ఇటు అధికారిక ప్రకటన, పూర్తిస్థాయి డేటా కోసం వార్తా సేకరణకు వచ్చిన విలేకరులు సైతం ఎంపీడీవో కార్యాలయం వద్దే నిరీక్షించాల్సిన దుస్థితి. ఎన్నికల నామినేషన్ల వంటి అత్యంత కీలకమైన సమయంలో సాంకేతిక వ్యవస్థలు విఫలమవడంపై వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నామినేషన్ల స్వీకరణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు.. ఆన్‌లైన్ సర్వర్ల సామర్థ్యం, బ్యాకప్ నెట్‌వర్క్‌ల పనితీరుపై ముందస్తుగా దృష్టి సారించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సర్వర్ లోపాలను తక్షణమే సరిదిద్ది పెండింగ్‌లో ఉన్న నామినేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కోరారు.

# మహిళా సాధికారతకు బ్యాంకుల ప్రోత్సాహం అత్యంత కీలకం....

## జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
స్వయం సహాయక సంఘాల మహిళల సమగ్ర వికాసానికి, గ్రామీణ మహిళా సాధికారతకు బ్యాంకులు అందిస్తున్న ఆర్థిక సహకారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా పేర్కొన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న జాతీయ సారస్ ఆజీవిక మేళా--2026లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన "సంవాద్ టు సమృద్ధి -- ఎస్‌హెచ్‌జీ రుణాల నుంచి లక్షపతి దీదీ వరకు'' ముఖాముఖి సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు, సూక్ష్మ వ్యాపారాలను బలోపేతం చేసుకునేందుకు బ్యాంకింగ్ రంగం నిరంతర తోడ్పాటు అందించాలని సూచించారు. గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చీ=ావీ జాతీయ సమన్వయకర్త అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఎస్‌హెచ్‌జీ--బ్యాంక్ రుణాల అనుసంధానంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా ఉందని, ఢిల్లీ వెలుపల తొలిసారిగా జాతీయ సరస్ మేళాను ఏపీలో నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. అనంతరం యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 5 లక్షలకు పైగా సంఘాలకు రూ.33,212 కోట్ల రుణాలు అందించామని, 'యూనియన్ లక్షపతి దీదీ పథకం' కింద అర్హులైన మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నామని వివరించారు. సదస్సులో ఏజీఎంలు మహేష్, శ్రీనివాస్, డిఆర్ డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాంచార రావు, అదనపు డైరెక్టర్ వై. రమ స్వయం సహాయక సంఘాలు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ అభ్యర్థి గెలిపించండి



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ ఎంపీటీసీ (సిపిఐ) అభ్యర్థి బి.శాంతి ఈరోజు నామినేషన్ వేశారు.ఈ సందర్భంగా సి.పి.ఐ తిరుపతి.జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతున్న కమ్యూనిస్టులను గెలిపించాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థల లలో కష్టజీవుల గొంతుకగ, నిధులను తమ స్వార్థం కొరకు గాక ప్రజల సేవకు ఉపయోగిస్తారని అన్నారు.ఎ.ఐ.టి.యు.సి జిల్లా కార్యదర్శి కె.రాదాకృష్ణ తన హృదయపూర్వక సహకరిస్తామన్నారు..తర్వత మండల కార్యదర్శి వై.యస్.మణి మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎ.ఐ.టి.యు.సి మండల కార్యదర్శి కార్తీక్ మా ట్లాడుతూ కార్మిక సంఘాలు అన్ని గట్టిగా పని చేయాలన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసి రాజన్ పార్టీ సీనియర్ నాయకులు మురళి మాజీ మండల కార్యదర్శి మోహన్ రెడ్డి రజాక్ సెల్వ వినయ్ తరుణ్ అమ్ములు శివగామి దాము హరి పెంచలయ్యతదితర ప్రజా సంఘాలు కార్మిక సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

## పోలీసులు భారీ బందోబస్తు మధ్య నామినేషన్లు
## -వైఎస్సార్‌సీపీ 34, టిడిపి 24, బిజెపి 01 నామినేషన్లు దాఖలు

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



రామచంద్రాపురం మండలంలో పోలీసుల భారీ బందోబస్తు మధ్య శుక్రవారంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల చివరి రోజు కావడంతో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం నుంచే తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి నామినేషన్లు వేయడంతో వైఎస్సార్‌సీపీ తన స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. నామినేషన్ల చివరి రోజు ముగిసే సమయానికి నమోదైన వివరాలను అధికారులు వెల్లడించారు. పార్టీలు వారీగా మూడో రోజుతో ముగిసిన -నామినేషన్ల వివరాలు -వైఎస్సార్‌సీపీ 34, టీడీపీ 24, బీజేపీ 1ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఉన్నతాధికారుల సమక్షంలో సీఐ సురేష్ కుమార్, ఎస్సై భక్తవత్సలం లు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల కేంద్రం వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ ప్రక్రియను ముగించారు. అత్యధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది.

# వాకాడు మండలంలో ఎంపీటీసీ స్థానాలకు భారీగా నామినేషన్లు

## వైసీపీ, టీడీపీ, బీఎస్పీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు :
వాకాడు మండలంలో ఎంపీటీసీ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అక్టోబర్ 23న వాకాడు మండల పరిధిలో నమోదైన నామినేషన్ వివరాల పట్టిక ప్రకారం కొండాపురం, కల్లూరు, వాకాడు-1, వాకాడు-2, నెల్లిపూడి, తిరుమూరు, బాలిరెడ్డి పాలెం, దుగ్గరాజుపట్నం, జమీన్‌కొత్తపాలెం, నిడుగుర్తి, పూడిరాయదురువు తదితర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు పోటీలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ తరఫున దానా శ్రీనివాసులు, రౌతు వనమ్మ, రావిపాటి శ్రీనివాసులు, కాకాని శ్రీనివాసులు, గుడూరు సుధ, సంగీతం మానస, బందీలి వెంకటయ్య, బత్తా సుందరయ్య, తిరుమల శెట్టి పొలమ్మ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ తరఫున సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, ఎదురు అచ్చెమ్మ, రౌతు లలిత నామినేషన్లు సమర్పించగా, బీఎస్పీ తరఫున పంత్రంగం వసంత్ నామినేషన్ దాఖలు చేశారు.మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు బరిలోకి దిగడంతో స్థానిక రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం ఆయా స్థానాల్లో పోటీపై మరింత స్పష్టత రానుంది.

# ఎన్‌టీఆర్ నగర్ వద్ద నిలిచిన రాకపోకలు

## రంగంలోకి దిగిన అధికారులు



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండల పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద ప్రజల రాకపోకలు తాత్కాలికంగా పూర్తిగా నిలిచిపోయాయి. గతంలో ఇక్కడి వంతెన కూలిపోవడంతో, కాంట్రాక్టర్ వంతెన పక్కనే తాత్కాలిక ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు రావడంతో ఆ ప్రత్యామ్నాయ మార్గం కూడా వరద నీటిలో మునిగిపోయింది. దీంతో అటు వైపు నుంచి ఇటు వైపునకు, ఇటు వైపు నుంచి అటు వైపునకు వెళ్లేందుకు వీలు లేక ప్రజలు, శ్రీ సిటీ లోని పలు పరిశ్రమలకు వెళ్లే కార్మికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారుఈ పరిస్థితిపై అధికారులు వెంటనే స్పందించారు. ప్రజల ఇబ్బందులను గమనించి, యుద్ధప్రాతిపదికన వంతెన మరమ్మతు పనులను ప్రారంభించారు

# చంద్రగిరి నామినేషన్ కేంద్రానికి కలెక్టర్, ఎస్పీ..!

## వైసీపీ అభ్యర్థులకు భద్రత కల్పించాలని నాయకులు విజ్ఞప్తి..

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:



చంద్రగిరి నియోజకవర్గంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు భద్రత కల్పించాలని వైసీపీ నాయకులు కోరడంతో, జిల్లా కలెక్టర్, ఎస్పీ వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి మండల కార్యాలయం వద్దకు చేరుకున్నారు. చంద్రగిరి పట్టణ పరిధిలో నామినేషన్ కేంద్రం వద్ద గుమి కూడిన వారిని హెచ్చరిస్తూ పోలీసులకు సూచనలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్.



ప్రజాభూమి

జనరల్ 10

శనివారం 24 అక్టోబరు 2026

# మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## ప్రతి పోలింగ్ కేంద్రానికి బీఎల్ఓను తప్పనిసరిగా నియమించాలి - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)ను తప్పనిసరిగా నియమిం చాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదే శించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మున్సిపల్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించి, ఎన్నికల పోలింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలు, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, ఎన్నికల సామగ్రి సిద్ధం, పర్యవేక్షణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్,ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బీఎల్ఓను నియమించి, ఓటరు చీటీల ముద్రణ, పంపిణీ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గైర్హాజరు, షిఫ్టెడ్, మరణించిన ఓటర్ల (ఏఎస్డీ) జాబితా తయారీ ప్రక్రియను పోలింగ్‌కు ముందుగానే పూర్తి చేయాలన్నారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధి కారులు (ఏఆర్వోలు) నిరంతరం పర్యవేక్షిం చాలని సూచించారు.



### పోలింగ్ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలి

పోలింగ్ విధుల నిర్వహణ కు వచ్చే సిబ్బందికి తాగునీరు, మరుగుదొడ్లు, షామియానాలు తదితర కనీస సౌకర్యాలను ముం దుగానే ఏర్పాటు చేయాలన్నారు. బీఎల్ఓలు లేదా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సహకారంతో ఈ ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ పార్టీ సిబ్బందికి పోలింగ్‌కు ముందు రోజు రాత్రి భోజనం, పోలింగ్ రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, టీ, స్నాక్స్ అందించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఫిర్యాదులకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

### పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అవసరమైన సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, దరఖాస్తు ఫారాలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ పై సంబంధిత సిబ్బందికి ముందస్తు శిక్షణ అందించాలన్నారు. అక్టోబర్ 26న రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. అక్టోబర్ 28న తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, వాతావరణ పరిస్థితులను పరిగణన లోకి తీసుకొని పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అక్టోబర్ 27 లేదా 29 తేదీల్లో నిర్వహించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచిం చారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, పూర్తిస్థాయి వీడియోగ్రఫీతో పార దర్శకంగా నిర్వహించా లని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమా చారం, నివేదికల సమన్వయం కోసం ఎన్నికల కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.

### ప్రతి రెండు గంటలకు పోలింగ్ సరళిపై సమీక్ష

పోలింగ్ పార్టీలు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్న వివరాలు, పోలింగ్ సరళి తదితర సమాచారాన్ని ప్రతి రెండు గంటలకు ఒకసారి సేక రించి అప్‌డేట్ చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పా టు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పోస్టల్ బ్యాలెట్, నివేదికల సమర్పణ, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, భోజన ఏర్పాట్లు తదితర ప్రతి విభాగానికి ఒక అధికారిని బాధ్యులు గా నియమించి, పనులు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు.

### ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా తనిఖీ చేయాలి

పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సంబంధిత పోలింగ్ కేంద్రాల వెలుపల నిబంధనల ప్రకారం ప్రద ర్శించాలని తెలిపారు. వార్డు సభ్యులు, చైర్ పర్సన్ లేదా సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల వివరాలు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ లో అక్షర దోషాలు లేకుండా, క్రమ సంఖ్యలు సక్రమంగా ఉండేలా తనిఖీ చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లు, కవర్లు, డిక్లరేషన్ ఫారాలు తదితర ఎన్నికల సామగ్రిని పర స్పరం సరిపోల్చుకొని, ఎలాంటి పొరపాట్లు లేకుండా సిద్ధం చేసు కోవాలన్నారు. బ్యాలెట్ పేపర్లపై గుర్తుల కేటా యింపు విషయంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

### నామినేషన్ల పరిశీలనలో జాప్యం చేయరాదు

మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియను నిబంధనల ప్రకారం, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లపై అభ్యంతరాలు వచ్చిన సందర్భాల్లో సంబంధిత నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే మాస్టర్ ట్రైనర్లు లేదా ఉన్నతాధికారుల సలహా లు తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నిర్ణ యాలు తీసుకునే క్రమంలో అనవసర జాప్యానికి తావులే కుండా, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రతి అం శాన్ని అధికారులు సమన్వయం తో, అప్రమత్తంగా, బాధ్యతా యుతంగా నిర్వహించి ఎన్నికల ప్రక్రియ విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదే శించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి తిప్పే నాయక్, ఆర్ డి ఓ ఎస్ మల్లిబాబు, ఆర్వోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వార్డుల్లో మంజునాథ్ ముమ్మర ప్రచారం

## -కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం-ఇంటింటా ప్రచారం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థి పురిడి మంజునాథ్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణం లోని 5, 6, 7, 8 వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ప్రజలను కలుసుకుంటూ కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రచారంలో భాగంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో మంజునాథ్ మమేకమయ్యారు. పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే పట్టణ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు అమర్నాథ్, ప్రియా గంగాధర్‌తో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బొందలవాడ ఎంపీటీసీ అభ్యర్థిగా ఆలం వెంకట నర్సానాయుడు నామినేషన్



ప్రజా భూమి నార్పల

మండలం బొందలవాడ ఎంపీటీసీ అభ్యర్థిగా ఆలం వెంకట నర్సానాయుడు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.

# జనసేన జడ్పీటీసీ అభ్యర్థిగా కొండిశెట్టి ప్రవీణ్ కుమార్ నామినేషన్



ప్రజా భూమి నార్పల

మండల జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కొండిశెట్టి ప్రవీణ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.

# జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా యం పెద్దిరాజు నామినేషన్



ప్రజా భూమి శింగనమల

మండల జడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా యం. పెద్దిరాజు నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థిగా ఆయన బరిలో నిలవడంతో మండలంలో ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది అభ్యర్థుల జాబితా వెల్లడికానుంది.

# మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వాహనాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ సుదీర్



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల నియోజకవర్గంలో స్థానిక సంస్థల (జడ్పిటిసి, ఎంపిటిసి) ఎన్నికల నామినేషన్ ప్రక్రియ లో భాగంగా శుక్రవారం పులివెందుల పట్టణం లోని శిల్పారామం సమీపంలో వాహనాల తలకి కార్యక్రమాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ చింతాటి సుధీర్ , పోలీసు అధికారులఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కడప నుండి పులివెందులకు వస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వాహనాన్ని నిలిపి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుండి నగదు, మద్యం లాంటివి తరలిస్తారని పై అధికారుల సూచనల మేరకు ఇక్కడ తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో ఎవరినైనా ఎంతటి వారినైనా చట్ట వ్యతిరేక పనులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు అన్నారు.

# యల్లనూరు ఎంపీటీసీ నామినేషన్ల ఆధిపత్య పోరు...?

## పరస్పరం రాళ్లతో దాడులు ..అల్లరి మూకలను చెదరగొట్టిన పోలీసులు...



ప్రజా భూమి. యల్లనూరు

స్థానిక ఎంపీటీసీ నామినేషన్ల ఘట్టం చివరి రోజు కావడంతో ఉదయం నుంచి జెసి వర్గానికి చెందిన ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు సజావుగానే సాగినప్పటికీ చివరి నిమిషంలో ఒక్కసారిగా రాజకీయ పార్టీల వర్గ విభేదాలు భగ్గుమన్నాయి మధ్యాహ్నం నుంచి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వర్గం నామినేషన్ వేయడానికి కార్యకర్తలతో రావడంతో ఇదే సమయంలో వైసీపీ పార్టీకి చెందిన భోగాతి నారాయణరెడ్డి తనయుడు విజయ ప్రతాప్ రెడ్డి నామినేషన్ వేయడానికి తన అనుచరులతో రావడంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం ఉన్నప్పటికీ పోలీసులు సీఐ వంశీకృష్ణ ఎస్ఐ రామాంజనేయరెడ్డి మరియు స్పెషల్ ఫోర్స్ ఆపే ప్రయత్నం చేశారు అయితే భోగాతి విజయ ప్రతాప్ రెడ్డి వర్గం వారు మేము వెళ్లి నామినేషన్ వేయాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగిన నేపథ్యంలోనే పోలీసులు కాసేపు ఆగాలి అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు భోగాతి ప్రతాప్ రెడ్డి కార్యకర్తలతో కొంతసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసినప్పటికీ పోలీసులు ససేమిరా అనడంతో పెద్దా రెడ్డి వర్గీయులు అక్కడికి చేరుకొని ఒకరిపై ఒకరు కట్టెలు రాళ్లతో దాడులకు పాల్పడడంతో పలు వాహనాలు ధ్వంసం అవడంతో పాటు ఇరు పార్టీ కార్యకర్తలకు గాయాలు కావడం వల్ల పోలీసులు ఇరు వర్గాల వైసిపి పార్టీలకు చెందిన వారిని అదుపు చేసినప్పటికీ పరిస్థితి విషమించడంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో లాఠీ ఛార్జ్ చేసిన అదుపు కాకపోవడంతో పోలీసులు టియల్ గ్యాస్ ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం జరిగింది.

# తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీటీసీ 1 2 నామినేషన్లు

## ర్యాలీతో వచ్చిన టిడిపి నాయకులు కార్యకర్తలు





ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థులు కార్యకర్తల ర్యాలీతో నామినేషన్లు దాఖలు చేశారు. శింగనమలలోని దర్గా నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు.ఎంపీటీసీ-1 అభ్యర్థి కాయల బాలకృష్ణ యాదవ్, చిన్న జిల్లాల పురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ-2 అభ్యర్థి తొట్ల అనూరాధ (అట్టే ధనుంజయ) తమ నామినేషన్లను దాఖలు చేశారు. భారీ జనసమీకరణతో నామినేషన్ల కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నార్పల మండలంలో 116 నామినేషన్లు

ప్రజా భూమి నార్పల

మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 116 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ తరఫున 69, టీడీపీ తరఫున 42, జనసేన నుంచి 2, సీపీఐ నుంచి 2, స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో కార్యాలయం వెల్లడించింది.

# బొందలవాడ, చామలూరు ఎంపీటీసీ అభ్యర్థులుగా ఆలం కుటుంబ సభ్యుల నామినేషన్లు



ప్రజా భూమి నార్పల

నార్పల మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బొందలవాడ ఎంపీటీసీ అభ్యర్థిగా ఆలం వెంకట నర్సానాయుడు, చామలూరు ఎంపీటీసీ అభ్యర్థిగా ఆలం శిరీష నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

# పార్టీలు ముఖ్యం కాదు.. ప్రజా సేవ ముఖ్యం

## శింగనమల 1 ఎంపీటీసీ స్వతంత్ర అభ్యర్థి గా ఎం పెద్దన్న నామినేషన్ దాఖలాలు.



ప్రజా భూమి శింగనమల

స్వతంత్ర ఎంపీటీసీ వీ.పెద్దన్న మాట్లాడుతూ రాజకీయ పార్టీలు వస్తాయి, పోతాయి. కానీ మన ఊరు, మన సమస్యలు అలాగే ఉండిపోతున్నాయి. పార్టీ జెండాల వెనుక నడిచే నాయకులకు పార్టీల అధిష్ఠానం ముఖ్యం, కానీ స్వతంత్రుడిగా నిలబడిన నాకు మీరే నా అధిష్ఠానం మీ సమస్యలే నా ప్రాధాన్యత.నా లక్ష్యాలు - మన మండల అభివృద్ధి నేను గెలిచిన వెంటనే మన గ్రామాల అభివృద్ధి కోసం కింది పనులపై ప్రత్యేక శ్రద్ధ పెడతాను రహదారులు డ్రైనేజీ ప్రతి వీధికి సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల ఆధునీకరణ. తాగునీరు ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడం.వీధి దీపాలు ,భద్రత రాత్రి వేళల్లో మహిళల భద్రత కోసం వీధి దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటు.ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజకీయ బేధాలు లేకుండా ప్రభుత్వ పథకాలు అందేలా చూడటం.యువతకు ఉపాధి మన మండల యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మరియు నైపుణ్య శిక్షణ ఇప్పించడం.రైతులకు సాయం వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై తక్షణమే స్పందించి, అధికారులతో మాట్లాడి పరిష్కరించడం.నేను ఏ పార్టీకి అమ్ముడుపోను. ఎవరికీ లొంగిపోను. నా జెండా మీ నమ్మకం, నా ఎజెండా మీ అభివృద్ధి. మీ అమూల్యమైన ఓటును వేసి, నన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని చేతులెత్తి ప్రార్థిస్తున్నాను.

# వైఎస్సార్‌సీపీలోకి అంజాద్

## -చైర్‌పర్సన్ అభ్యర్థి షాజియా సమక్షంలో పార్టీ మారిన టీడీపీ కార్యకర్తలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ ఎన్నికల వేళ 35వ వార్డులో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తెలుగు దేశం పార్టీకి చెందిన కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వార్డుకు చెందిన దివంగత మాజీ కౌన్సిలర్ జహిరుద్దీన్ కుమారుడు షేక్ అంజాద్‌తో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి షాజియా సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ ముఖ్య నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకున్న తరుణంలో చోటుచేసుకున్న ఈ చేరికలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా 35వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వార్డులో పార్టీ బలోపేతం, ఓటర్ల మద్దతు కూడగట్టడం లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీకి చెందినవారు వైఎస్సార్‌సీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షాజియా, స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి షేక్ ఫర్జానా వార్డులో ప్రజలను కలుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పార్టీ అభ్యర్థులు ప్రజలకు వివరిస్తున్నారు. మరోవైపు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల చేరికలు ఎన్నికల ప్రచారంలో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, షేక్ షబ్బీర్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంటూరు ఎంపీటీసీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా రామన్న దొర నామినేషన్

* కూటమి నాయకులతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాల సమర్పణ
* మంటూరు గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా.. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తా

ప్రజాభూమి ప్రతినిధి – దేవీపట్నం:
దేవీపట్నం మండలం మంటూరు ఎంపీటీసీ స్థానానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా రామన్న దొర నామినేషన్ దాఖలు చేశారు. కూటమిలో భాగంగా మంటూరు ఎంపీటీసీ స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో ఆయన శుక్రవారం ఉదయం దేవీపట్నంలోని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని బీజేపీ, తెలుగుదేశం పార్టీ (టీడీపీ), జనసేన పార్టీల నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఆయన వెంట ఉన్నారు.మంటూరు ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన అనంతరం రామన్న దొర మాట్లాడుతూ మంటూరు ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సహకారంతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, స్థానికంగా నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మంటూరు ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే తన లక్ష్యమని వెల్లడించారు.కూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేన నాయకుల సహకారంతో ఎన్నికల్లో ముందుకు సాగుతానని రామన్న దొర తెలిపారు. మంటూరు ఎంపీటీసీ స్థానంలో తనకు మద్దతు తెలిపి ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు.నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# నేడు అడ్డతీగలలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల
అడ్డతీగలలో శనివారం సాయంత్రం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. అడ్డతీగల ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్ అవుట్‌డోర్ కోర్టులో అక్టోబర్ 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పిఠాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, గోకవరం, రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం, రాజవొమ్మంగి తదితర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పురుషుల డబుల్స్‌తో పాటు 45 ఏళ్లు పైబడిన వారికి ప్రత్యేక విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు.పోటీల్లో విజేతలకు ట్రోఫీలు, మెడల్స్‌తో పాటు నగదు బహుమతులు అందజేయనున్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.నవీన్, బాలాజీ, నిఖిల్, బాల, వికాస్, వసంత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, క్రీడాభిమానులు, యువత, ప్రజలు హాజరై టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.మరిన్ని వివరాలకు: 8500242783, 7901507527, 6302949727.




# రాజవొమ్మంగిలో 11 ఎంపీటీసీ స్థానాలకు 64 నామినేషన్లు

## చివరి రోజే 29 దరఖాస్తులు.. 24న పరిశీలన

ప్రజాభూమి ప్రతినిధి రాజవొమ్మంగి:
రాజవొమ్మంగి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు మూడు రోజుల వ్యవధిలో మొత్తం 64 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు మూడు, రెండో రోజు 32 నామినేషన్లు అందగా, చివరి రోజైన శుక్ర వారం మరో 29 దరఖాస్తులు నమోదయ్యాయి. దీంతో నామినేషన్ల మొత్తం సంఖ్య 64కు చేరింది. చివరి రోజు నామినేషన్ల దాఖలుకు గడువు ముగియడంతో అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. ఈ నెల 24న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరామమూర్తి వెల్లడించారు. పరిశీలన అనంతరం ఎన్నికల తదుపరి ప్రక్రియ కొనసాగనుంది.



# ఎంపీటీసీ అభ్యర్థులు సమయానికి హాజరుకావాలి



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల
అడ్డతీగల మండలంలో ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన శనివారం నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి కె. రమణ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి ఎంపీటీసీ స్థానాల వారీగా పరిశీలన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన సమయానికి 10 నిమిషాల ముందుగా హాజరుకావాలని సూచించారు. అభ్యర్థితో పాటు ప్రతిపాదకులు, అనుమతించిన వ్యక్తి మాత్రమే హాజరుకావాలని స్పష్టం చేశారు. నామినేషన్ రసీదు, పార్ట్–6 కాపీ తప్పనిసరిగా తీసుకురావాలని రిటర్నింగ్ అధికారి కె. రమణ సూచించారు.

# రంపచోడవరంలో కారం సుజాత నామినేషన్

## జడ్పీటీసీ బరిలో సీపీఎం అభ్యర్థి.. గిరిజన హక్కుల పరిరక్షణే లక్ష్యం



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:
వి.ఆర్.పురం మండలం సీపీఎం పార్టీ బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థురాలు కారం సుజాత నామినేషన్ పర్వం రంపచోడవరంలో శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారుల సమక్షంలో ఆమె నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా కారం సుజాత మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రజల హక్కుల పరిరక్షణ, స్థానిక సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న రహదారులు, తాగునీరు, వైద్యం, విద్య, ఉపాధి, గిరిజన సంక్షేమం తది తర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ప్రజల తరఫున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే బలమైన గొంతుకగా నిలుస్తానని చెప్పారు. జడ్పీటీసీగా అవకాశం కల్పిస్తే మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ పనిచేస్తానని హామీ ఇచ్చారు. నామినేషన్ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కారం సుజాతకు మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తనను ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని కారం సుజాత కోరారు.

# రాజకీయాల్లోకి యువత అడుగులు

## రాజవొమ్మంగి 2 ఎంపీటీసీకి జనసేన తరపున పాడే వీరబాబు నామినేషన్

రాజవొమ్మంగి, ప్రజాభూమి
ప్రజాసేవలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో యువత రాజకీయాల్లోకి రావడం ప్రజాస్వామ్యానికి సానుకూల పరిణామం. ఈ క్రమంలో రాజవొమ్మంగి 2 ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ తరఫున పాడే వీరబాబు నామినేషన్ దాఖలు చేశారు. గ్రామస్థాయి నుంచే ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడానికి యువత ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుంటూ, బాధ్యతాయుతమైన ప్రజాసేవ దిశగా యువత అడుగులు వేయడం స్థానిక పాలనకు ఉపయోగకరంగా నిలుస్తుంది.



# వారసత్వ రాజకీయాల్లోకి విష్ణుప్రియ



## వీఆర్‌పురం జడ్పీటీసీ బరిలో కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి రంపచోడవరంలో నామినేషన్ దాఖలు.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:
వి.ఆర్.పురం మండల జడ్పీటీసీ ఎన్నికల బరిలో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వాళ్ల విష్ణుప్రియ నిలిచారు. గురు వారం రంపచోడవరంలో ఆమె జడ్పీటీసీ అభ్య ర్థిగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. పార్టీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు, సమక్షంలో ఆమె నామినే షన్ కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణం లో జరిగింది. రాజకీయ రంగానికి విష్ణుప్రియ కొత్త అయినప్పటికీ, ఆమె కుటుంబానికి మాత్రం రాజకీయాలు కొత్తేమీ కావు. దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీతో అనుబంధం కొనసాగిస్తూ, వి.ఆర్.పురం మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన రాజకీయ కుటుంబం నుంచి విష్ణుప్రియ రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు.

**కుటుంబానికే ప్రత్యేక రాజకీయ నేపథ్యం**

వాళ్ల రంగారెడ్డి వి.ఆర్.పురం మండలంలో టీడీపీకి బలమైన నాయకుడిగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తిగా ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. 2000 నుంచి 2005 వరకు తుమ్మిలేరు గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన, ఆ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఆయన సతీమణి చంద్రావతి 2006 నుంచి 2011 వరకు తుమ్మిలేరు పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవలందించారు. భార్యాభర్తలిద్దరూ స్థానిక ప్రజలతో మమేకమై, ముఖ్యంగా మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే కొండరెడ్డి గిరిజనుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని కుటుంబ వర్గాలు తెలిపాయి. అదే విధంగా రంగారెడ్డికి తోడుగా నిలిచిన ఆయన సోదరుడు వాళ్ల వెంకటేశ్వరరెడ్డి కూడా స్థానిక ప్రజల సమస్యల పరిష్కారం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం పనిచేశారు.

విద్య, రహదారులు, తాగునీరు, మౌలిక వసతు లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో ప్రజలకు అండగా నిలిచినట్లు వారు తెలిపారు. వాళ్ల రంగారెడ్డి 2021 నుంచి 2026 వరకు జడ్పీటీసీగా పనిచేశారు. జడ్పీటీసీగా ఉన్న సమయంలో మండలంలోని వివిధ గ్రామాల సమస్యలను జిల్లా పరిషత్, ఐటీడీఏ, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో తండ్రి రంగారెడ్డి, తల్లి చంద్రావతి, కుటుంబ సభ్యులు కొనసాగించిన ప్రజాసేవా వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వాళ్ల విష్ణుప్రియ ఇప్పుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**అగ్రికల్చర్‌లో బీఎస్సీ.. రాజకీయాల్లోకి తొలి అడుగు**

వాళ్ల విష్ణుప్రియ అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు. వ్యవసాయ కుటుంబాలు, గిరిజన ప్రాంతాల జీవన విధానం, స్థానిక సమస్యలపై అవగాహనతో పాటు కుటుంబ రాజకీయ నేపథ్యం ఆమెకు ప్రజలతో అనుసంధానం కావడానికి దోహదపడుతుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. తన రాజకీయ అరంగేట్రాన్ని ప్రజాసేవకు వేదికగా మార్చుకోవాలని విష్ణుప్రియ భావిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గిరిజన, గిరిజనేతర ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి, వ్యవసాయం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని ఆమె పేర్కొంటున్నారు.

"ప్రజల ఆశీస్సులతో జడ్పీటీసీగా అవకాశం కల్పిస్తే మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. గిరిజన, గిరిజనేతర ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి గొంతుకగా నిలుస్తాను. టీడీపీతో పాటు కూటమి బలోపేతానికి కృషి చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను" అని విష్ణుప్రియ పేర్కొన్నారు. కుటుంబానికి ఉన్న రాజకీయ అనుభవం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రజాసేవా నేపథ్యం, కొత్త తరానికి చెందిన విష్ణుప్రియకు ఉన్న విద్యార్హతలు కలగలిసి ఆమె జడ్పీటీసీ అభ్యర్థిత్వంపై మండల రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. నామినేషన్ అనంతరం ఆమెకు టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.




# గంగవరం జడ్పీటీసీ స్థానానికి మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు

జనసేన నుంచి కుంజం సిద్దు,వైసీపీ నుంచి బల్లెం శివదొర,టీడీపీ నుంచి తీగల ప్రభ






ప్రజాభూమి ప్రతినిధి గంగవరం :
పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన గంగవరం మండల జడ్పీటీసీ స్థానానికి మూడు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు రంపచోడవరం జిల్లా పరిషత్ కార్యాలయంలో అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించడంతో మండలంలో రాజకీయ సందడి నెలకొంది జనసేన పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ గంగవరం మండల అధ్యక్షుడు కుంజం సిద్దు నామినేషన్ దాఖలు చేశారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల సీనియర్ నాయకులు పల్లాల గణేష్ కృష్ణ రోలుపల్లి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బల్లెం శివదొర గురువారం రంపచోడవరం జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ సమర్పించారు గత ఐదేళ్లపాటు పంచాయతీ అధ్యక్షుడిగా ప్రజలకు సేవలందించిన అనుభవం ఆయనకు ఉంది తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా మాజీ ఎంపీటీసీ తీగల ప్రభ కూడా రంపచోడవరం జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో నిలవడంతో గంగవరం మండల జడ్పీటీసీ ఎన్నికలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది అభ్యర్థుల నామినేషన్లతో మండలంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది రానున్న రోజుల్లో రాజకీయ పార్టీల ప్రచారం, ఎన్నికల వ్యూహాలు మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

# మోహనపురం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా బొగ్గుల రాజమ్మ నామినేషన్

## నాగుమామిడి నుంచి భారీ ర్యాలీ గంగవరంలో రాజకీయ సందడి



ప్రజాభూమి ప్రతినిధి గంగవరం:
పోలవరం జిల్లా గంగవరం మండలంలోని మోహనపురం ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బొగ్గుల రాజమ్మ నామినేషన్ దాఖలు చేశారు తన స్వగ్రామమైన నాగుమామిడి నుంచి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,అనుచరులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి గంగవరం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు అక్కడ ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు భారీ ర్యాలీతో ఎన్నికల సందడి నాగుమామిడి గ్రామం నుంచి నాయకులు,కార్యకర్తలు,అభిమానుల సమక్షంలో రాజమ్మ ర్యాలీగా తరలిరావడంతో గంగవరంలో ఎన్నికల సందడి కనిపించింది పార్టీ శ్రేణులు ఆమెకు మద్దతుగా తరలివచ్చి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామస్థాయి ఎన్నికల్లో తమ అభ్యర్థిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా టీడీపీ శ్రేణు లు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాయి మోహనపురం ఎంపీటీసీ స్థానంపై ఆసక్తి మోహన పురం ఎంపీటీసీ స్థానానికి బొగ్గుల రాజమ్మ నామినేషన్ దాఖలు చేయడంతో స్థానిక రాజ కీయాల్లో ఎన్నికల చర్చ మొదలైంది నామినేషన్ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, అనుచరులు తరలిరావడం ప్రాధాన్యత సంతరించుకుంది రానున్న రోజుల్లో ప్రచార కార్య క్రమాలు ఊపందుకోవడంతో మోహనపురం ఎంపీటీసీ ఎన్నిక మరింత ఆసక్తికరంగా మారనుంది.

# నామినేషన్ల ప్రక్రియ భద్రతా ఏర్పాట్లపై జిల్లాఎస్పీ ఆకస్మిక తనిఖీ

## నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి భద్రతను సమీక్షించిన జిల్లా ఎస్పీ కె,చక్రవర్తి



ప్రజాభూమి ప్రతినిధి గంగవరం:
పోలవరం జిల్లా గంగవరం మండలంలో జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మూడో రోజు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి నామినేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు,ఇతరులను నిలిపివేస్తూ, నిబంధనల ప్రకారం ఒక అభ్యర్థితో పాటు మరొకరిని మాత్రమే లోపలికి అనుమతించేలా పోలీసులు చర్యలు చేపట్టారు ఎన్నికల నిబంధనల్లో భాగంగా 34వ సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎక్కడా గుంపులుగా ప్రజలు గుమిగూడకుండా పర్యవేక్షిస్తున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ కె,చక్రవర్తి మాట్లా డుతూ, ఇప్పటివరకు గంగవరంలో 22నామినేషన్లు దాఖలయ్యాయని,ఎలాంటి ఇబ్బందులు లేకుం డా ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇదే విధంగా ఎన్నికల ప్రక్రియ ముగిసే వర కు శాంతిభద్రతలను కాపాడుతూ,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్ర మ త్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. నామి నేషన్ కేంద్రం పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు పోలీసుల విధుల నిర్వహణను పరిశీలించిన ఎస్పీ, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్య క్రమంలో అడ్డతీగల సీఐ ఎం, గజేం ద్ర కుమార్, గంగవరం ఎస్సై వెంకయ్య,పోలీసు సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.



# కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయం : సిపిఐ

- విమర్శలు చేసే వారికి ప్రజలే గుణపాఠం చెప్తారు

ప్రజాభూమి, ప్రతినిధి వేలేరుపాడు

రానున్న స్థానిక ఎన్నికల్లో సిపిఐ,టిడిపి, జనసేన కలిసి బలపరిచిన కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని, తమ పొత్తులను విమర్శించే వారికి ప్రజలే గుణపాఠం చెప్తారని, సిపిఐ నాయకులు ఉద్ఘాటించారు. భూదేవిపేట గ్రామంలో సీనియర్ నాయకులు సన్నేపల్లి సాయిబాబు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల కార్యదర్శి బాడిశ రాము మాట్లాడుతూ, అభివృద్ధి పథంలో ఆంధ్ర రాష్ట్రం ముందుందని, అనేక ప్రజా సమస్యల పరిష్కారమేకై నిరంతరం పోరాటాలు చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. మండలంలోని ప్రజలకు



పోరాటాలలో వెనుతిరగని సిపిఐ పనితీరు గురించి తెలుసన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. బిజెపితో స్థానిక ఎన్నికల్లో ఎక్కడ పొత్తులేదని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో పోటీ దారులైన వైసిపి, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ బలపరిచిన కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని మండల ప్రజలను కోరారు. బహిరంగంగానే పొత్తుతో పోటీ చేస్తున్నాం. స్థానిక ఎన్నికల్లో టిడిపితో భారత కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగానే పొత్తుతో ఎన్నికల్లో పోటీకి దిగామన్నారు. రహస్యంగా అక్రమ పొత్తులు సిపిఐకి ఎక్కడ లేవన్నారు. దాగుడుమూతల రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే పరిస్థితిలో భారత కమ్యూనిస్టు పార్టీ లేదని, సిపిఐని విమర్శించే వారిని గట్టిగా హెచ్చరించారు.

భారత కమ్యూనిస్టు పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజా శ్రేయస్సు కొరకే ఉంటుందన్నారు. రామవరం, మేడేపల్లి ఎంపీటీసీలుగా సిపిఐ అభ్యర్థులు కరటం సువర్ణ, కారం భవాని నామినేషన్ దాఖలు చేశారని తెలియజేశారు. ఈ సమావేశంలో కారం ధారయ్య , పిట్టా ప్రసాద్, సన్నేపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులకు మద్దతివ్వండి

- ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే,జిల్లా టీడీపీ అధ్యక్షుడు బడేటి చంటి పిలుపునిచ్చారు.ఏలూరులోని 11, 13, 24వ డివిజన్లలో కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.ప్రజలు పూల వర్షంతో నాయకులకు స్వాగతం పలికారు.ప్రభుత్వం మాటల్లో చెప్పిన అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తోందని బడేటి చంటి పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతిస్తే అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడు తూ కూటమికి వేసే ఓట్లు అభివృద్ధికి మరింత బాటలు వేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, మాజీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, జనసేన సీనియర్ నాయకులు నారా శేషు,రెడ్డి నాగరాజు, ఎస్సెమ్మార్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు. 11వ డివిజన్ జనసేన అభ్యర్థి దొంతికుర్తి విజయ, 13వ డివిజన్ జనసేన అభ్యర్థి కొప్పన మంగ,24వ డివిజన్ టీడీపీ అభ్యర్థి గొంగాడి బోసుబాబు కూడా ప్రచారంలో పాల్గొన్నారు.

## జెడ్ పి బరిలో కొప్పాక రోజా రాణి

- జనసేన ఆవిర్భావం నుండి పార్టీ వెంటే



ప్రజాభూమి ప్రతినది, తాళ్లపూడి

మండలంలో పైడిమెట్ట గ్రామానికి చెందిన కొప్పాక రోజా రాణి జనసేవ నుండి జెడ్ పి బరిలో నిలిచారు. జనసేన నియోజక వర్గ పరిశీలకులు, కొవ్వూరు ఎ ఎం సి డైరెక్టర్ కొప్పాక విజయ్ కుమార్ సతీమణి రోజా రాణి. విజయ్ కుమార్ స్వగ్రామం మండలంలోని పైడిమెట్ట గ్రామం. జనసేన ఆవిర్భావం నుండి పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సూచనలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి విజయ్ విశేషంగా కృషి చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు నుండి జనసేన అభ్యర్తిత్వం ఆశించినా, పార్టీ నిర్ణయమే శిరోధార్యం గా బి ఎస్ పి తరుపున ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు. 2024లో సైతం కూటమి లో భాగంగా టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వర రావు విజయానికి వీరు పాటు బడ్డారు. మండలంలో పార్టీ కార్యకర్తలతో పాటు, వీరి బంధుగణం అధిక సంఖ్యలో ఉండడం విజయ్ కుమార్ విజయానికి కలిసివచ్చు విషయంగా చెప్పవచ్చు. కూటమి నేతలందరూ ఐక్యతతో పనిచేస్తే రోజా రాణి గెలుపు నల్లేరుపై నడక అని చెప్పవచ్చు.

## స్వతంత్ర అభ్యర్థిగా పానుగంటి రజని

- మద్దతుగా కదిలిన 1,500 మంది కార్యకర్తలు
- పార్టీలకు అతీతంగా మద్దతు తెలిపిన నాయకులు, కార్యకర్తలు, యువత



ప్రజాభూమి ప్రతినిధి చాట్రాయి

చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది. ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పానుగంటి సూరిబాబు సతీమణి పానుగంటి రజిని శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమెకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో సుమారు 1,500 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. పోలవరం గ్రామానికి చెందిన పానుగంటి రజిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగగా, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరిడి అప్పారావు, చాగంటి బుచ్చిబాబు, ఎర్ర చిన్నయ్య, చాగంటి నరసింహారావు ఆమెకు మద్దతు ప్రకటించారు. దీంతో నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో ర్యాలీ కొనసాగగా, నామినేషన్ కార్యక్రమానికి స్థానికులు తరలివచ్చారు. వివిధ వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువత పార్టీలకుఅతీతంగా మద్దతు ప్రకటించడం ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అనంతరం పానుగంటి రజిని ఎంపీటీసీ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సీనియర్ నాయకుల మద్దతు, ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తల సంఖ్యతో పోలవరం గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది. స్వతంత్ర అభ్యర్థిగా పానుగంటి రజిని ఎన్నికల బరిలో నిలవడంతో పోలవరం గ్రామంలో ఎన్నికలపై ఆసక్తి నెలకొంది.

## మూడో రోజు ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల జోరు

- మూడు రోజుల్లో 91 నామినేషన్లు దాఖలు
- వెల్లడించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈ.బి. విలియమ్స్



ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

రెండో సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆగిరిపల్లి మండల పరిషత్ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం మూడో రోజు 47 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈ.బి. విలియమ్స్ వెల్లడించారు. మూడు రోజులుగా కొనసాగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో మొత్తం 91 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. వీటిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 46, తెలుగుదేశం పార్టీ నుంచి 32, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు, భారతీయ జనతా పార్టీ నుంచి ఒకరు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు నామినేషన్లు సమర్పించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నిర్వహించినట్లు రిటర్నింగ్ అధికారి ఈ.బి. విలియమ్స్ పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులందరూ ఐక్యంగా పనిచేయాలి

- మంత్రి పార్థసారథి పిలుపు



ప్రజా భూమి ప్రతినిధి చాట్రాయి

చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం తాజా మాజీ ఎంపీటీసీ చింత గుంట్ల వెంకటేశ్వరరావు జనసేన పార్టీలో చేరిన అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ని మర్యాదపూర్వకంగా శుక్రవారం నూజివీడు లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతతో ఎన్నికల బరిలో దిగి లక్ష్య సాధన దిశగా పనిచేయాలని మంత్రి పార్థసారథి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ కల్లేపల్లి బాలు, చింత గుంట్ల నాగేశ్వరరావు, చింతగుంట్ల చిన్న రంగయ్య, రమణ, నెహ్రూ, దొంతు మల్లికార్జునరావు ,కల్లేపల్లి జీవరత్నం, పుచ్చకాయల మహేష్ చింతగుంట్ల శ్రీనివాసరావు, జనసేన నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన అభివృద్ధి.. గడపగడపకు సంక్షేమం

- స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం
- మన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో పాలకొల్లు నియోజకవర్గంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పాలకొల్లులోని తన కార్యాలయంలో కూటమి ముఖ్య నాయకులు, శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా, అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ 1200 కోట్ల వరకు నిధులను తీసుకొచ్చి వివిధ పనులు చేపట్టినట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. సిమెంట్ రహదారుల నిర్మాణం, సిమెంట్ డ్రైన్ల ఏర్పాటు, రైతులకు ఉపయోగపడే పుంత రహదారుల అభివృద్ధి, మంచినీటి పథకాల పనులు తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీర్ఘకాలంగా పరిష్కారాని కి నోచుకోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రణాళికాబద్ధంగా ముందు కు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనా లను కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.ఇప్పటికే పూర్తిచేసిన అభివృద్ధి పనులతో పాటు, మిగిలిన కాలంలో చేపట్టనున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు. గ్రామాల వారీగా జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ ప్రయోజనాలు, ఇంకా చేపట్టాల్సిన పనులపై నాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి అందుబాటులో



ఉంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే కూటమి అభ్యర్థులకు ప్రధాన బలమని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధిని గమనిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టేలా నాయకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కూటమిలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి కోరారు.



## "కోట" ఎంపీటీసీ స్థానాలకు 61 నామినేషన్లు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మహేందర్‌నాథ్

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

యం.పి.టి.సీ ఎన్నికలు నకు సంబంధించి కామవరపుకోట మండలం నందు 61 నామినేషన్ వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి మహేందర్ నాథ్ చెప్పారు. జనసేన పార్టీ నుండి ఐదుగురు, టిడిపి పార్టీ నుండి 28 మంది, వైఎస్ఆర్సిపి పార్టీ నుండి 27, భారతీయ జనతా పార్టీ నుండి ఒక నామినేషన్ వచ్చాయని ఈరోజు వచ్చాయని చెప్పారు. మూడు రోజుల మీద మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 110 నామినేషన్లు దాఖలు అయినట్టు మండల ఎన్నికల అధికారి తెలిపారు. నామినేషన్ల సమయం ముగిసేనాటికి మొత్తం వివిధ పార్టీలకు గాను కాంగ్రెస్ – 1, జనసేన పార్టీ నుండి 8, తెలుగుదేశం పార్టీ నుండి 51, వైఎస్ఆర్సిపి పార్టీ నుండి 48, బిజెపి పార్టీ నుండి ఒకటి, స్వతంత్ర అభ్యర్థిగా 1 ఎన్నికల నియమావళి సమయానికి నామినేషన్లు వచ్చాయని చెప్పారు.

## చిత్తశుద్ధితో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపీటీసీ ఇండిపెండెంట్ అభ్యర్థి మర్రి రమేష్



ప్రజాభూమి బుట్టాయగూడెం

లక్ష్మడుగూడెం ఎంపీటీసీ పరిధిలో ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని ఎంపీటీసీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మర్రి రమేష్ బాబు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్వీకరణ కేంద్రంలో శుక్రవారం ఆయన లక్ష్మడు గూడెం ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మడు గూడెం ప్రాదేశిక నియోజకవర్గం పరిధిలోని సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందని అన్నారు. ముందుగా రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు, పేదలకు నివాసాల నిర్మాణాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తానని హామీ ఇచ్చారు. తన గెలుపుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈయన వెంట ముంగండ శామ్యూల్ జ్ఞాని, తదితరులు ఉన్నారు.

## ముగిసిన జడ్పిటిసి ఎంపీటీసీల నామినేషన్ ఘట్టం

- కాజులూరులో 97 ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు...
- నేడు స్క్రూటినీలు-27 వరకు నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం



ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు

స్థానిక సంస్థలు ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ ఎన్నికల సంబంధించి నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుండి ప్రారంభం కాగా కాజులూరు మండల పరిధిలో 20 ఎంపీటీసీ స్థానాలకు గాను శుక్రవారం నామినేషన్ల ఘట్టం ముగిసేసరికి మొత్తం 97 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కాగా బుధవారం 15, గురువారం 44 నామినేషన్లు శుక్రవారం 38 మొత్తం రెండు రోజుల్లో 97 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. బిజెపి పార్టీ నుండి 4,తెలుగుదేశం పార్టీ నుండి 22, జనసేన పార్టీ నుండి, 22, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి 43, స్వతంత్ర అభ్యర్థులుగా 6 నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్లను ఈనెల 23 సాయంత్రం 5.00 గంటల వరకు స్వీకరించిన దరఖాస్తుల్లో. అంద్రంగి- 4, ఆర్యవటం -8, బంధనపూడి- 6 ,చేదువాడ- 4 ,దుగ్గదుర్రు-4 గొల్లపాలెం -4, అయితపూడి- 4 జగన్నాథగిరి -8 ,కాజులూరు1- 6 ,కాజులూరు2- 4, కాజులూరు3 -4 కోలంక -4, మంజేరు-7, మతకుమిల్లి- 5, పల్లిపాలెం-3 ,శలపాక -5 ఉప్పుమిల్లు- 4 మొత్తం 97 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 24వ తేది నామినేషన్ల పరిశీలన నిర్వహించబడుతుందని, 27.వతేది మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని ఈసందర్భంగా తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ శు క్రవారంతో ప్రశాంతంగా ముగిసింది. చివరి రోజు కావడంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ అనుచరులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్లు దాఖలు చేసేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తమ బలాబలాలను ప్రదర్శిస్తూ నామినేషన్లు సమర్పించారు. కొందరు అభ్యర్థులు డీజే సౌండ్ సిస్టంలు, డప్పు వాయిద్యాలతో హంగు ఆర్భాటాల మధ్య ర్యాలీలుగా వచ్చి నామినేషన్లు దాఖలు చేయడంతో మండలంలో ఎన్నికల సందడి నెలకొంది. తమకు అనుకూలంగా ప్రజాభిమానాన్ని కూడగట్టుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నించగా, ప్రధాన రాజకీయ పార్టీల మధ్య పోటీ వాతావరణం స్పష్టంగా కనిపించింది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఇక ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల బలాబలాలపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 24 అక్టోబర్ 2026

# బుట్టాయగూడెం మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వం

**ప్రజాభూమి బుట్టాయగూడెం**

బుట్టాయిగూడెం మండలంలో మండల ప్రాదేశిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ నుండి నామినేషన్ స్వీకరణ ఘట్టం ప్రారంభమైంది. ఈనెల 21వ తేదీ, బుధవారం మొదటిరోజు 9 నామినేషన్లు దాఖలు కాగా 22వ తేదీ, గురువారం, రెండో రోజు 40 నామినేషన్లు, 23వ తేదీ, శుక్రవారం మూడవ రోజు 33 నామినేషన్లు మొత్తం 82 నామినేషన్లు అందినట్లు ఎన్నికల అధికారులు ఏవి. సుబ్బరాయన, ఎంపీడీవో కె.జ్యోతి, తహసిల్దార్ ప్రమద్వర వివరించారు. మూడవరోజు దాఖలైన 33 నామినేషన్లలో వైసీపీ 11, ఇండిపెండెంట్లు 9, టిడిపి 6,జనసేన పార్టీ 5, కాంగ్రెస్ 1, సిపిఐ ఎం 1 ఉన్నాయి. దాఖలైన మొత్తం 82




నామినేషన్లలో వైసీపీ 27 అత్యధికంగా దాఖలు చేయగా, టిడిపి 20 జనసేన పార్టీ 14 ఇండిపెండెంట్ 11, న్యూ డెమోక్రసీ 5, సిపిఎం 3, కాంగ్రెస్ 2 ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ ఘట్టంలో స్థానిక ఎస్ఐ




పి. చెన్నారావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పలువురు గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది నామినేషన్ల హెల్ప్ డెస్క్ లో తమ సేవలు అందించారు.



# ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ

- పటిష్ఠ పోలీసు బందోబస్తు.. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు

**ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండలంలో ఎంపీటీసీ, ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారంతో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ సూచనలతో, గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి, నూజివీడు ప్రాంతాల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్, నూజివీడు ఎస్సై నాగేశ్వరరావు తమ సిబ్బందితో భద్రతను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వి. సురేష్ హెచ్చరించారు. అభ్యర్థులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా చూడాలని కోరారు.

# రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిని కలిసిన మాజీ ఎంపీటీసీ జనసేన నేత చింతగుంట్ల



**ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు**

చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం తాజా మాజీ ఎంపీటీసీ చింత గుంట్ల వెంకటేశ్వరరావు జనసేన పార్టీలో చేరిన అనంతరం రాష్ట్ర మంత్రి పులుసు పార్థసారథిని మర్యాదపూర్వకంగా నూజివీడులో కలిశారు ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు కార్యకర్తల మధ్య ఐక్యతతో ఎన్నికల బరిలో దిగి లక్ష్య సాధన దిశగా పనిచేయాలని మంత్రి పార్థసారథి సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ లు కల్లేపల్లి బాలు చింత గుంట్ల నాగేశ్వరరావు చింతగుంట్ల చిన్న రంగయ్య రమణ నెహ్రూ దొంత మల్లికార్జునరావు కల్లేపల్లి జీవరత్నం పుచ్చకాయల మహేష్ చింతగుంట్ల శ్రీనివాసరావు జనసేన నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మీర్జాపురం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా గోళ్ల శ్రీలక్ష్మి నామినేషన్ దాఖలు



**ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు**

తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా గోళ్ల శ్రీలక్ష్మి (భర్త సుధాకర్) నామినేషన్ దాఖలు చేశారు. నూజివీడులోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున ర్యాలీగా తరలివచ్చారు. అభ్యర్థి గోళ్ల శ్రీలక్ష్మికి మద్దతుగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ర్యాలీతో ఎంపీడీవో కార్యాలయ పరిసరాల్లో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో కాపా శ్రీనివాసరావు, గోళ్ల లోకేశ్వరరావు, మరీదు గాంధీ, దండుబోయిన రవి, గోళ్ల ప్రసాదరావు, చీకటి శ్రీనివాసరావు, కనుగంటూ శ్రీనివాసరావు, విజయరాజు తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు అభ్యర్థికి మద్దతు తెలుపుతూ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పోలాటితిప్పలో ఎన్నికల సందడి..

- మోకా రాణి నామినేషన్‌కు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు.
- పోలాటితిప్ప నుంచి ఎండీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ..
- మోకా రాజు సతీమణి మోకా రాణి నామినేషన్ దాఖలు.

**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మచిలీపట్నం మండలం పోలాటితిప్ప గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది. ఎంపీటీసీ అభ్యర్థిగా మోకా రాజు సతీమణి మోకా రాణి నామినేషన్ దాఖలు చేసేందుకు వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. పోలాటితిప్ప గ్రామం నుంచి ఎండీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కండువాలు ధరించిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొనడంతో గ్రామంలో ఎన్నికల సందడి కనిపించింది. తమ అభ్యర్థికి మద్దతుగా నినాదాలు చేస్తూ ర్యాలీగా ఎండీఓ కార్యాలయానికి చేరుకున్నారు. గ్రామం నుంచి కార్యాలయం వరకు సాగిన ర్యాలీతో ఆ ప్రాంతంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు మోకా రాణి ఎండీఓ కార్యాలయానికి చేరుకోవడంతో నాయకులు, కార్యకర్తలు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. వేలాదిమంది తరలివచ్చిన ఈ ర్యాలీతో పోలాటితిప్పలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి స్పష్టంగా కనిపించింది.

# నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ డీకే బాలాజీ

- అభ్యర్థులకు ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు

**మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి అక్టోబర్ 23**

రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ శుక్రవారం పరిశీలించారు. పెడన మండల పరిషత్ కార్యాలయం, ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణను కలెక్టర్ తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేసినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతి అభ్యర్థి స్వేచ్ఛగా, ప్రశాంతంగా నామినేషన్ దాఖలు చేసుకునేలా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కృష్ణా జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎవరైనా అభ్యర్థిని నామినేషన్ దాఖలు చేయకుండా అడ్డుకున్నా, నామినేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురైనా వెంటనే 9849903961 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. అందిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, నామినేషన్ల దాఖలుకు అవసరమైన సహాయం అందిస్తామని వెల్లడించారు. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉన్నందున, ఆలోపు అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంపై జిల్లా యంత్రాంగం తరఫున సోషల్ మీడియాలో కూడా ప్రకటన విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, నామినేషన్ కేంద్రాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నామినేషన్లను స్వీకరించి, అభ్యర్థులు సమర్పించే పత్రాలను ఎన్నికల నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.

# నూజివీడు జనసేన జడ్పీటీసి అభ్యర్దిగా అశ్విని

**ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు**

నూజివీడు మండల జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి నూజివీడు నియోజక వర్గ సమన్వయకర్త మరీదు శివరామకృష్ణ సతీమణి శ్రీమతి మరీదు అశ్విని నామినేషన్ నూజివీడు మండల జడ్పీటీసీ అభ్యర్థి జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి ఉ నూజివీడు సమన్వయ కర్త మరీదు శివరామకృష్ణ సతీమణి శ్రీమతి మరీదు అశ్విని శుక్రవారం ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం లో నామినేషన్ వెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాము నియోజకవర్గ నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్ టౌన్ నాయకులు రేపాని రాజు కొనకళ్ళ రాజేష్ తోట బలరాం తదితరులు పాల్గొన్నారు.



# కాజులూరు శెలపాక ఎంపీటీసీ స్థానాల్లో బిజెపి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు

**ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రమైన కాజులూరు-1, శెలపాక ఎంపీటీసీ స్థానాల్లో భారతీయ జనతా పార్టీ చెందిన తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం భారతీయ జనతా పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులుగా శెలపాక గ్రామం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన ముషిని గంగాభవాని, మండల కేంద్రమైన కాజులూరు శ్రీరామ్ నగర్ కాలనీ నుంచి ఓసి కాపు సామాజిక వర్గం నుండి కాజులూరు1 ఎంపిటిసి అభ్యర్థినిగా సలాది ఆదిలక్ష్మి, తమ తమ నామినేషన్లను శుక్రవారం ఆ పార్టీ శ్రేణులతో



నామినేషన్లు దాఖలు చేశారు.

ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాడ్ వీరబాబు, జగన్నాథగిరి, భారతీయ జనతా పార్టీ కాజులూరు మండల అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ, ప్రధాన కార్యదర్శిలు నిమ్మన రాజేష్, వాసంశెట్టి రామకృష్ణ, జగన్నాధగిరి మాజీ ఎంపీటీసీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొప్పన లక్ష్మి, ఓ బి సి మోర్చా మండల ప్రధాన కార్యదర్శి ముషిని ఏడుకొండలు ఓబిసి మార్చ మండల అధ్యక్షులు జక్కా శ్రీనివాస్, మండల ఎస్ ఐ ఆర్ కన్వీనర్ దేవు పట్టాభి, జిల్లా ఓ బి సి మార్చ నాయకులు చందాల దుర్గాప్రసాద్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బందారు సత్యనారాయణ, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకర రామకృష్ణ, యువమోర్చా నాయకులు పంపన రాంబాబు, పుణ్యమంతుల నరేంద్ర, సలాది సత్తిబాబు సలాది బుజ్జి బందారు లోవరాజు యాళ్ల ప్రసాదు నామ సత్యం సతీష్ అధిక సంఖ్యలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# నూజివీడు జెడ్పిటిసి అభ్యర్థిగా జూట్రూ నాగ వసంత

**ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు**

నూజివీడు మండలం జిల్లా పరిషత్ ప్రాదేశిక కమిటీ సభ్యురాలిగా (జెడ్‌పిటిసి)గా పోతు రెడ్డిపల్లి గ్రామ శివారు మద్రికుంట కు చెందిన బిసి మహిళ కుమారి జూట్రు నాగ వసంత భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేసేందుకు ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల ప్రధాన అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించి తగు రసీదు పొందడం జరిగింది ఈ సందర్భంగా నాగవసంత మాట్లాడుతూ నేను ఇంజనీరింగ్ విద్యాభ్యాసం ముగించుకుని ఉద్యోగ ప్రయత్నం లో ఉండగా ప్రధానమంత్రి మోడీ పరిపాలన విధానాలకు ఆకర్షితురాలినై ఈ పోటీకి సిద్ధపడినాను గతంలో బిజెపి సభ్యత్వం కార్యక్రమంలో , మండల కిసాన్ మోర్చా అధ్యక్షురాలు గా మరియు జిల్లా మహిళా మోర్చా సభ్యురాలిగా నేను చేసిన సేవలను గుర్తించి గొల్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు మాజీ మండల పార్టీ అధ్యక్షులు మరియు



జిఎస్ఎన్ ఫౌండేషన్ ఏలూరు చైర్మన్ మరియు బిజెపి పార్టీ క్రియాశీలక సభ్యులు శ్రీమతి గోగినేని ( వంకినేని ) వెంకట శశిరేఖ గార్ల ఆశీర్వాదంతో ఈ ఎన్నికల్లో పోటీ చేయుటకు నామినేషన్ పత్రాలను సమర్పించి ఉన్నాను ఈ సందర్భంగా నూజివీడు గ్రామీణ ఓటర్ మహాశయులకు మీ అమూల్యమైన ఓటు కమలం గుర్తుపైన వేసి గెలిపించి మన గౌరవ ప్రధానమంత్రి సేవలను మరింత విస్తృతంగా గ్రామీణ ప్రజలకు అందేటట్లు నా వంతు కృషి చేస్తానని తెలియజేస్తున్నాను ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి.వి.ఎన్ మాధవ రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ గారపాటి సీతారామాంజనేయ చౌదరి జిల్లా పార్టీ అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను

ఇట్లు మీ జూట్రూ నాగవసంత
నూజివీడు మండల మహిళా కిసాన్ మోర్చా అధ్యక్షురాలు
మరియు ఏలూరు జిల్లా మహిళా మోర్చా భారతీయ జనతా
పార్టీ సభ్యురాలు

ప్రజాభూమి



# మూడు పురపాలక సంస్థల్లో అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ..!

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టహర్ డా. శ్రీధర్ చెరుకూరి- అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి**

ప్రజాభూమి ప్రతినిధి,కడప: వైఎస్సార్ కడప జిల్లాలోని కడప నగరపాలక సంస్థ, రాజంపేట, మైదుకూరు పురపాలక సంఘాల్లోని నిర్దేశిత వార్డులకు నామినేషన్ల దాఖలుకు అదనపు అవకాశం కల్పిస్తూ గడువును పొడిగించడంతో.. కడపలో 11 వార్డులు, రాజంపేటలో 11 వార్డులు, మైదుకూరులో 32 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ సజావుగా కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తోకలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా.. రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిర్దేశించిన జిల్లాలోని మూడు పట్టణ స్థానిక సంస్థల్లో అక్టోబర్ 24వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లోనూ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని, అక్కడ



కూడా పలువురు అభ్యర్థులు మొదటి రోజు నామినేషన్లు సమర్పించినట్లు పేర్కొన్నారు. గతంలో నామినేషన్లు దాఖలు చేయలేకపోయిన అభ్యర్థులందరికీ ఈ అవకాశం కల్పించామని, వారు గడువు లోగా నామినేషన్లు సమర్పించాలని సూచించారు.

ప్రశాంతంగా జెడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్లు... జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను కూడా ఉదయం నుంచి అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, మరికొందరు నామినేషన్లు సమర్పిస్తున్నారని వెల్లడించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహాయం కోరిన అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఎవరైనా అభ్యర్థులకు భద్రతాపరమైన ఆందోళనలు ఉంటే పోలీసు నియంత్రణ గదిని సంప్రదించాలని సూచించారు. నామినేషన్ కేంద్రానికి చేరుకునే వరకు అవసరమైన సహాయం, భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశామని పేర్కొన్నారు. జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా కొనసాగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా మిగిలిన ప్రక్రియలు కూడా సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# పట్టణ స్థానిక సంస్థల్లో నాలుగు చోట్ల నామినేషన్లకు మరో అవకాశం..!

- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కడప, రాజంపేట, మైదుకూరులో నామినేషన్ల స్వీకరణకు పొడిగింపు
- అక్టోబరు 23, 24 తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్ ప్రాంగణంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాభూమి ప్రతినిధి,కడప: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కొన్ని పట్టణ స్థానిక సంస్థల్లో అభ్యర్థులు బెదిరింపులు, దాడులు, నామినేషన్ పత్రాల చింపివేత వంటి పరిస్థితుల కారణంగా నామినేషన్లు దాఖలు చేయలేకపోయినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించిందన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం 2026 అక్టోబరు 22న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎంపిక చేసిన నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్ల స్వీకరణ గడువును 48 గంటల పాటు పొడిగించినట్లు వివరించారు. వైఎస్సార్ కడప జిల్లాలోని కడప నగరపాలక సంస్థ, రాజంపేట పురపాలక సంఘం, మైదుకూరు పురపాలక సంఘం పరిధిలోని నిర్దేశిత వార్డులకు ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ అక్టోబరు 23, 24 తేదీల్లో ఉదయం



11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు నిర్దేశించిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలతో పాటు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిర్దేశించే కలెక్టరేట్ ప్రాంగణంలోనూ నామినేషన్ పత్రాలను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వార్డుల వారీగా నామినేషన్ల స్వీకరణ

కడప నగరపాలక సంస్థలో 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55వ వార్డులకు నామినేషన్ల గడువు పొడిగించారు. రాజంపేట పురపాలక సంఘంలో 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27వ వార్డులకు ఈ అవకాశం కల్పించారు. మైదు కూరు పురపాలక సంఘంలోని మొత్తం 32 వార్డులకూ నామినేషన్ల స్వీకరణ గడువును పొడిగించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం, పొడిగించిన గడువులో కొత్తగా స్వీకరించిన నామినేషన్ల పరిశీలన అక్టోబరు 25న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. కొత్తగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు మాత్రమే అదే రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

**అన్ని పట్టణ స్థానిక సంస్థలకు సవరించిన ఎన్నికల షెడ్యూల్**

రాష్ట్రంలోని మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలకు, పొడిగింపు వర్తించే నాలుగు సంస్థలతో పాటు విజయనగరం నగరపాలక సంస్థకు కూడా వర్తించేలా తుది పోటీదారుల జాబితా ప్రచురణ నుంచి ఎన్నికల షెడ్యూల్‌ను సవరించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 25న మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది పోటీదారుల జాబితాను ప్రకటిస్తారు. నవంబరు 1న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అవసరమైతే నవంబరు 2న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరిగి పోలింగ్ నిర్వహిస్తారు. నవంబరు 3న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలు చేయాలనుకునే అభ్యర్థులు నిర్దేశించిన తేదీలు, సమయాలను గమనించి సంబంధిత నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలి

**- రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.**

**- భద్రత, బారికేడింగ్, సీసీ కెమెరాలు, విద్యుత్ సదుపాయాలు, సిబ్బంది రాకపోకలకు ప్రత్యేక మార్గాలపై అధికారులకు సూచనలు**

ప్రజాభూమి ప్రతినిధి,జగ్గయ్యపేట / నందిగామ / మైలవరం:

స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా జగ్గయ్యపేట ఎస్.జి.ఎస్ కళాశాల యూజీసీ బ్లాక్, కంచికచర్ల, మార్కెట్ యార్డ్, కొండపల్లి జెడ్పీ పాఠశాల తదితర ప్రాంతాల్లో ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత భవన సముదాయాలు, వాటి ప్రాంగణాలు, కౌంటింగ్ హాళ్లు, గదుల్లో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ లేదా స్ట్రాంగ్ రూములుగా వినియోగించనున్న గదుల్లో నేలపై ఏర్పాటు చేసిన నంబర్డ్ గ్రిడ్లు, మార్కింగ్‌లను పరిశీలించి, కౌంటింగ్ ప్రక్రియకు అనువుగా ఏర్పాట్లు ఉండేలా తగిన సూచనలు చేశారు. భవన ప్రాంగణంలో బారికేడింగ్, టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది విధుల నిర్వహణకు అవసరమైన స్థలం, రాకపోకలకు అనువైన మార్గాలపై అధికారులతో




చర్చించారు. కౌంటింగ్ హాళ్లలో ఒక్కో విభాగం, వరుసకు అవసరమైన టేబుళ్ల సంఖ్య, టేబుళ్ల మధ్య ఉండాల్సిన దూరం, అధికారులు, సిబ్బంది సులభంగా రాకపోకలు సాగించేందుకు అవసరమైన మార్గాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ క్రమంలో అధికారులు సిద్ధం చేసిన లేఅవుట్ మ్యాప్‌లు, నివేదిక పత్రాలను పరిశీలిస్తూ గదుల కొలతలు, ప్రవేశ ద్వారాలు, నిష్క్రమణ ద్వారాలు, భద్రతాపరమైన అంశాలను అంచనా వేశారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళు ఉన్న ప్రాంగణాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ప్రాంగణాల్లో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన ఇతర సౌకర్యాలను ముందుగానే గుర్తించి, వాటి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూముల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్ ప్రవేశ ద్వారం స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భద్రతాపరమైన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే భవనాల చుట్టూ, కౌంటింగ్ కేంద్రాల లోపల బారికేడింగ్, ఫెన్సింగ్ ఏర్పాట్లను ఇప్పటి నుంచే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత ప్రాంతాల్లో భద్రతా నియంత్రణకు అనువుగా ఏర్పాట్లు ఉండేలా పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కౌంటింగ్ హాళ్లలోకి ప్రవేశించే కౌంటింగ్ అధికారులు, సిబ్బంది, ఏజెంట్ల కోసం వేర్వేరు ప్రవేశ మార్గాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రాకపోకల సమయంలో రద్దీ ఏర్పడకుండా, విధుల నిర్వహణకు ఆటంకం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, భద్రత, మౌలిక సదుపాయాలు, కౌంటింగ్ హాళ్ల లేఅవుట్ వంటి అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, జగ్గయ్యపేట తహసిల్దార్ ఎస్.శిరీష, మున్సిపల్ కమిషనర్ దుర్గాప్రసాద్, ఎంపీడీవో అరుణ, కంచికచర్ల తహసిల్దార్ నరసింహారావు, ఇబ్రహీంపట్నం తహసిల్దార్ శ్రీనివాసమూర్తి, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# కూనవరం జడ్పీటీసీ బరిలో కాంగ్రెస్ అభ్యర్థి చిచ్చడి తిరుపతిరావు- పార్టీ శ్రేణుల సమక్షంలో నామినేషన్ దాఖలు

ప్రజాభూమి, ప్రతినిధి, కూనవరం:

కూనవరం మండల జడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చిచ్చడి తిరుపతిరావు శుక్రవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. రంపచోడవరం కేంద్రంగా జరిగిన నామినేషన్ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు మద్దతుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చిచ్చడి తిరుపతిరావు వెంట శ్రీమంతుల వెంకటరమణ, సత్యనారాయణ రాజు తదితరులు ఉన్నారు. అలాగే పార్టీ సీనియర్ నాయకులు నందికొండ శ్రీను, షేక్ అహ్మద్ బాషా తదితరులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని అభ్యర్థికి తమ మద్దతు తెలిపారు. కూనవరం



మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో తిరుపతిరావు ఎన్నికల బరిలో నిలిచినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ముఖ్యంగా మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల తరఫున బలమైన గొంతుకగా నిలుస్తామని వారు పేర్కొన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ విధానాలను వివరించడంతో పాటు అభ్యర్థికి విస్తృత మద్దతు కూడగట్టాలని సూచించారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ..!

ప్రజాభూమి ప్రతినిధి,కడప: జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కడప



జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ చివరి రోజు ప్రక్రియను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు

# అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం

**- ఎక్సైజ్ చట్టాల అమల్లో నిర్లక్ష్యానికి తావులేదు**
**- సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర నిఘాకు చర్యలు**
**- ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని.. ఎక్సైజ్ చట్టాలను పటిష్టంగా అమలుచేయనున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. విజయవాడ కరెన్సీ నగర్‌లోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్



కార్యాలయంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ మద్యం దుకాణాలు, బార్ల నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా తనిఖీలు నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించకుండా, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలనుంచి అక్రమంగా మద్యం రవాణా కాకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని,ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం సరఫరాను అడ్డుకునేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యాలయ డిప్యూటీ కమిషనర్ వివేక్, విజయవాడ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ లావణ్య, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, రెండు జిల్లాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎక్సైజ్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్.. గొల్లపూడిలోని శ్రీసాయి కృష్ణ వైన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మద్యం దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అక్రమ విక్రయాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో చినార్కూర్, కూనవరం-2 ఎంపీటీసీ అభ్యర్థులుగా నామినేషన్

ప్రజా భూమి ప్రతినిధి కూనవరం,

మండలంలోని చినార్కూర్ మరియు కూనవరం-2 సెగ్మెంట్ల నుండి టీడీపీ, బీజేపీ పార్టీలు బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థులు రెండు నామినేషన్లు వేయడం జరిగింది. చినార్కూర్ అభ్యర్థిగా సోడే రమాదేవి, కూనవరం-2 అభ్యర్థిగా బట్టు





అరుణకుమారి నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం ఆలోచించే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసమే పనిచేస్తామని గ్రామంలో అభివృద్ధి పనులలో ముందుండి నడిపిస్తామని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలను భాగస్వాములు చేస్తూ సమస్యల పరిష్కారమే ధ్యాయంగా పనిచేస్తూ అంతఃకరణ శుద్ధితో ఉంటామని మీ అమూల్యమైన ఓటు గాజు గ్లాసు గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో మమ్మల్ని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు దాసరి నరేంద్ర కుమార్ అరకు పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ మచ్చ వినయ్ ప్రసాద్ కూనవరం మాజీ వైస్ ఎంపిపి బండారు సాంబశివరావు కుంజా అనిల్ సోడే ముత్తయ్య మడివి కామయ్య శ్యామల లింగారావు శ్యామల రామిశెట్టి తాటి రాంబాబు వంజం లక్ష్మణ్ వెట్టి సురేష్ ముచ్చిక చంద్రరావు ముచ్చక రాముడు శ్యామల కన్నయ్య తుష్టి రమేష్ శ్యామల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి సోందే పాపారావు

ప్రజా భూమి ప్రతినిధి కూనవరం ..

మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బలపరిచిన జడ్పిటిసి అభ్యర్థి సోందే పాపారావు ఈరోజు నామినేషన్ వేయటం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్. ఆలూరి కోటేశ్వరరావు,



మండల వైసీపీ జనరల్ సెక్రెటరీ, ఇంటి పూర్ణయ్య, ఎక్స్ ఎంపీటీసీ,మండల ప్రధాన కార్యదర్శి మడకం పూర్ణ, ఎక్స్ జెడ్పిటిసి ఎక్స్ రాష్ట్ర బీసీ డైరెక్టర్ అరవ వెంకట రామారావు మాజీ రాష్ట్ర మేరీ కార్పొరేషన్ డైరెక్టర్ దీకొండ గంగాధర్ సోడే రమేష్,మండల ఎగ్జిక్యూటివ్ నెంబర్ గడ్డం శ్రీను. ఎక్స్ ఎంపీటీసీ సరియం మహాలక్ష్మి, బేతి ముత్తయ్య పై నరసింగపేట గ్రామ శాఖ అధ్యక్షుడు మీడియం బాలరాజు మరియు కార్యకర్తలు ఈరోజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బలపరిచిన అభ్యర్థి సోందే పాపారావు నామినేషన్ వేయడం జరిగింది.